teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 185 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 31 అక్టోబర్ 2024 | పేజీలు : 08 | వెల ‘5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

పాఠకులకు, ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు **దీపావళి** శుభాకాంక్షలు

పండుగని పురస్కరించుకొని మా కార్యాలయానికి
గురువారం సెలవు.. శుక్రవారం పత్రిక వెలవడదు
పునరదర్శనం శనివారం
- చీఫ్ ఎడిటర్



విద్యార్థులకు మేలు చేకూరేలా ప్రభుత్వం **కీలక నిర్ణయం**

విద్యార్థుల కాస్మోటిక్స్, డైట్ చార్జీల పెంపు

2 లో



ట్రాఫిక్ సమస్య నియంత్రణకు రంగంలోకి **డీఆర్ఎఫ్ సిబ్బంది**

50 మంది డీఆర్ఎఫ్ సిబ్బందికి నగరంలో విధులు

2 లో

# ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం పెంపు

## 3.64శాతం డీఏ పెంచగా.. 2022 జులై 1 నుండి వర్తింపు

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులకు పండగ పూట గుడ్ న్యూస్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం పెంచుతూ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగులకు 3.64% డీఏ పెంచగా ఇది 2022 జులై 1వ తేదీ నుండి వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): ఈ పెరిగిన డీఏ నవంబర్ జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లింపులు చేయనున్నారు. ఇక 2022 జులై నుండి 2024 అక్టోబర్ 31 వరకు గల డీఏ బకాయిలను జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నారు. 2025 మార్చిలోపు రిటైర్ అయ్యే ఉద్యోగుల డీఏ బకాయిలు మాత్రం 17 సమాన వాయిదాల్లో చెల్లించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. అయితే జీపీఎఫ్ ఖాతాలు లేని కంటిజెంట్ ఉద్యోగులకు 2025 ఫిబ్రవరి నుంచి 17 బకాయిల్లో ఈ మొత్తం అందివ్వనున్నారు.






కానిస్టేబుళ్ల ఆందోళనల నేపథ్యంలో

# కీలక నిర్ణయం

సెక్రటేరియట్ సెక్యూరిటీ నుంచి టిజీఎస్పీ పోలీసుల తొలగింపు

ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ జితేందర్



హైదరాబాద్, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఏక్ స్టేట్-ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ కానిస్టేబుళ్లు గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తోన్న విషయం తెలిసిందే. బెటాలియన్ కానిస్టేబుళ్లకు మద్దతుగా వారి కుటుంబ సభ్యులు సైతం రోడ్డెక్కి నిరసన

మిగతా 2 లో

రేపా.. ఎల్లుండా.. టైమ్ చెప్తే

# ఇద్దరం కలిసి వస్తాం

రేవంత్‌ను ఎలా డీల్ చేయాలో రాసి పెట్టుకున్నాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీష్ రావు హాట్ కామెంట్స్

హైదరాబాద్, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు హాట్ కామెంట్స్ చేశారు. హరీష్ రావును ఎలా డీల్ చేయాలో తమకు తెలుసునంటూ సీఎం చేసిన కామెంట్స్‌కు హరీష్ రావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మీడియాతో చిట్‌చాట్‌లో పాల్గొన్న హరీష్ రావు, రేవంత్‌ను ఎలా డీల్ చేయాలో రాసి పెట్టుకుంటున్నా మన్నారు. తనను డీల్ చేయడానికంటే ముందు తన ముఖ్యమంత్రి పదవి

మిగతా 2 లో





ఇష్టంగా తినే మయోనైస్‌పై

# నిషేధానికి నిర్ణయం

ఫుడ్ సేఫ్టీ అధికారులతో సమీక్ష అనంతరం నిర్ణయం

త్వరలో ఉత్తర్వులు జారీ చేయనున్న ఫుడ్ సేఫ్టీ కమిషనర్

హైదరాబాద్, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఆహార ప్రియులు ఎంతో ఇష్టంగా తినే మయోనైస్‌పై నిషేధం విధించాలని నిర్ణయించింది. ఫుడ్

మిగతా 2 లో

పార్టీ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి

# సీరియస్ వార్నింగ్

లైన్ దాటి మాట్లాడితే చర్యలు తప్పవని స్పష్టం

హైదరాబాద్, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ నేతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. పార్టీ లైన్ దాటి మాట్లాడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కలిగించే వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని పీసీసీ ముఖ్యనేతలు నిర్ణయించారు. ఈ మధ్య కొందరు నేతలు తరచూ పార్టీని ఇబ్బంది పెట్టే

మిగతా 2 లో





జనావాస సముదాయాల్లో టపాసుల దుకాణాలు

# ఉండద్దు


అధికారులను ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): జనావాస సముదాయాల్లో టపాసుల దుకాణాలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని హైదారాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు చెప్పిన పొన్నం. నగరంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అధికారులకు కీలక ఆదేశాలు

మిగతా 2 లో

## బీసీ రిజర్వేషన్‌ల అమలుపై సర్కార్ కి హైకోర్టు ఆదేశాలు

ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని సూచన



హైదరాబాద్, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ల అమలుపై ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ వర్గాలకు కల్పించాల్సిన రిజర్వేషన్‌ల శాతంను నిర్ణయించడానికి వీలుగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం డాక్టర్ కె.కృష్ణమూర్తి కేసులో, త్రిసభ్య ధర్మాసనం వికాస్ కిషన్‌రావు గవాలి కేసులో వెలువరించిన ఆదేశాలను పాటించి రాష్ట్రంలో కూడా ప్రత్యేక

మిగతా 2 లో



## రాష్ట్రంలో రాగల మూడు రోజులపాటు మోస్తరు వర్షాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో రాగల మూడురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతంలో ఉన్న దక్షిణ ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంత్రంలో సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతూ ఎత్తుకు వెళ్లేకొలది దక్షిణ దిశగా వంగి

మిగతా 2 లో



Teenmaar News Paper - Telangana

# కానిస్టేబుళ్ల ఆందోళనల నేపథ్యంలో కీలక నిర్ణయం

**మొదటి పేజీ తరువాయి**

బాటపట్టారు. బెటాలియన్ కానిస్టేబుళ్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయ భద్రతలో మార్పులు చేపట్టింది. సెక్రటేరియట్ సెక్యూరిటీ నుంచి తెలంగాణ స్పెషల్ పోలీసులను తొలగింగించింది. ఇప్పటి వరకు సచివాలయ భద్రతను టీజీఎస్పీ పర్యవేక్షించగా ఇక నుంచి ఎస్పీఎఫ్ పోలీసులు సెక్రటేరియట్ వద్ద గస్తీ కాయనున్నారు. ఈ మేరకు తెలంగాణ సెక్రటేరియట్ భద్రతలో మార్పులు చేస్తూ 2024, అక్టోబర్ 30న రాష్ట్ర డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ స్పెషల్ పోలీస్‌ల ఆందోళన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే బెటాలియన్ కానిస్టేబుళ్ల ఆందోళనల దృష్ట్యా ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి భద్రతలో ప్రభుత్వం మార్పులు చేసింది. సీఎం రేవంత్ సెక్యూరిటీతో పాటు ఆయన ఇంటి వద్ద భద్రత నుండి బెటాలియన్ కానిస్టేబుళ్లను పోలీస్ శాఖ తొలగించింది. టీజీఎస్పీ స్థానంలో సీఎం నివాసం వద్ద సెక్యూరిటీని ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) పోలీసులకు అప్పగించింది.



## రేపా.. ఎల్లుండా.. టైమ్ చెప్తే ఇద్దరం కలిసి వస్తాం

**మొదటి పేజీ తరువాయి**

చేజారకుండా కాపాడుకోవాలని రేవంత్ రెడ్డికి హితవు చెప్పారు. బాపూఘాట్‌లో భారీ గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తే స్వాగతిస్తామని హరీష్ రావు ప్రకటించారు. కేసీఆర్ పెట్టిన అంబేద్కర్ విగ్రహానికి దండం పెట్టరని సీఎం రేవంత్ రెడ్డి తీరుపై విమర్శలు గుప్పించారు. అదీకాక.. ప్రజలు సందర్శించే అవకాశం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎగవేతల రేవంత్ రెడ్డి అన్నందుకు బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో తనపై కేసు పెట్టారని హరీష్ రావు ఆరోపించారు. అడ్డుకోబోము అంటూనే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిపై కేసులు పెడుతున్నారని ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి తప్పిదాల వల్ల హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ దారుణ స్థితికి పడిపోయిందన్నారు. తాను ఫుట్ బాల్ ఆడనని.. క్రికెట్ ఆడుతానని చెప్పిన్న హరీష్ రావు.. వచ్చే ఎన్నికల్లో వికెట్ తీసేది తామేనని అన్నారు. రేవంత్ రెడ్డి సెల్ఫ్ గోల్ వేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో మూసీ నుంచి వాడపల్లి వరకు పాదయాత్ర చేద్దామంటూ సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌కు హరీష్ రావు ప్రతిసవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్‌తో పాదయాత్రకు తాము రెడీ అని ప్రకటించారు. రేపా.. ఎల్లుండా.. టైమ్ చెప్తే కేటీఆర్, తాను ఇద్దరం వస్తామని హరీష్ రావు స్పష్టం చేశారు. గన్‌మెన్‌లు లేకుండా రేవంత్ రెడ్డి మూసీపై పాదయాత్రకు రావాలని మాజీ మంత్రి ప్రతి సవాల్ విసిరారు. ఇటీవల మూసీ ఒడ్డున మూడు నెలలు నివాసం ఉండాలని కూడా సీఎం సవాల్ విసిరారని దానికి సైతం తాము సిద్ధమని హరీష్ రావు మ-రోసారి స్పష్టం చేశారు.

## జనావాస సముదాయాల్లో టపాసుల దుకాణాలు ఉండద్దు

**మొదటి పేజీ తరువాయి**

జారీ చేశారు. ఈ సందర్భంగా దీపావళి ఒక పెద్ద వేడుక అని, ఈ పండగ సందర్భంగా జరిగే అగ్నిప్రమాదాలు నివారించడానికి టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రం మరియు జంట నగరాల్లో టపాసుల దుకాణాలు చిన్న చిన్న గల్లి ల్లో ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటికే హైదారాబాద్ లో అబిడ్స్ తో పాటు యకత్‌పుర లోని చంద్రానగర్‌లో టపాసుల దుకాణాలు వల్ల రెండు అగ్ని ప్రమాదాలు జరిగాయని, అదృష్టవశాత్తూ పెద్దగా ప్రమాదం జరగలేదని తెలిపారు. టపాసుల దుకాణాల వల్ల ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ఆ టపాసుల దుకాణాలని మైదాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకునే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని హైదారాబాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. అలాగే వెంటనే ఎక్కడైనా చిన్న చిన్న గల్లిల్లో జన నివాస ప్రాంతాల్లో, వ్యాపార ప్రదేశాల్లో ఇలాంటి టపాసుల దుకాణాలు నిర్వహించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వాటికి ప్రత్యామ్నాయంగా హైదరాబాదులోని ఖాళీ ప్రదేశాలు, క్రీడా మైదానాలు, పాఠశాలను టపాసుల దుకాణాలుగా వాడుకోవాలని, ఎక్కడైనా నివాస ప్రాంతాల మధ్య టపాసుల దుకాణాలు ఉంటే సంబంధిత ఏరియా అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రమాదాలు నివారించడానికి అందరు సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని, ఎక్కడైనా జనావాసాలు, నివాస సముదాయాల్లో టపాసులు అమ్ముతుంటే సంబంధిత అధికారికి ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రంలో రాగల మూడు రోజులపాటు మోస్తరు వర్షాలు



**మొదటి పేజీ తరువాయి**

ఉందని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. అలాగే, శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలుపడే అవకాశాలున్నాయని వివరించింది.

## పార్టీ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ వార్నింగ్

**మొదటి పేజీ తరువాయి**



స్టేట్‌మెంట్స్ ఇస్తున్నారని పద్ధతి మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ స్పష్టం చేశారు. పార్టీని ఇబ్బంది పెట్టే వ్యాఖ్యలు చేస్తున్న నాయకులపై పలువురు కాంగ్రెస్ నేతలు సీరియస్ అయ్యారు. పార్టీ లైన్ దాటి మాట్లాడితే ఊరుకునేది లేదంటూ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, సీఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్ చేశారు. కాగా ఇటీవల మంత్రి కొండా సురేఖ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఎంతటి దుమారాన్ని రేపాయో అందరికీ తెలిసిందే. హీరోయిన్ సమంత, నాగచైతన్య విడిపోడానికి కారణం కేటీఆర్ అంటూ కొండా సురేఖ ఇచ్చిన స్టేట్‌మెంట్ రచ్చకు కారణమైంది. అంతే కాకుండా అక్కినేని నాగార్జున కుటుంబానికి సంబంధించి వ్యక్తిగత విషయాలపై మంత్రి కామంట్స్ చేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దీనిపై అనేక విమర్శలు కూడా వెల్లువెత్తాయి. తన కామెంట్స్‌పై కొండా సురేఖ క్షమాపణల చెప్పినప్పటికీ సమస్య సద్దుమణలేదు. పైగా కొండా సురేఖపై అటు హీరో నాగార్జున, మాజీ మంత్రి కేటీఆర్‌ను కోర్టులో పరువునష్టం దావా కేసులు వేశారు. అయితే కొండా సురేఖ చేసిన ఈ వ్యాఖ్యలు కొంత మేరక పార్టీకి కూడా నష్టాన్ని చేకూర్చాయని పార్టీ వర్గాల టాక్. ఇదిలా ఉండగా ఇటీవల కలెక్టర్ల విషయంలో కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చేసిన కామెంట్స్ కూడా అనేక విమర్శలకు దారి తీసింది. జగ్గారెడ్డి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పదిసార్లు ఫోన్ చేసిన తన ఫోన్ ఎత్తకపోవడంతో కలెక్టర్‌ను తిట్టానంటూ జగ్గారెడ్డి ఆయన మాట్లాడిన ఓ వీడియో సామాజిక మాద్యమాల్లో తెగచెక్కర్లు కొట్టింది. కలెక్టర్ ఫోన్ ఎత్తకపోవడంతో చివరకు కలెక్టర్ పీఏకు ఫోన్ చేశానని, కలెక్టర్ ఆఫీసులో లేకుండా ఇంట్లో పడుకున్నారా అని అడిగానని అంతేకాకుండా కలెక్టర్ భర్తతో పడుకుందా అని కూడా పీఏను ప్రశ్నించానని తనకు కోపం వస్తే ఇలాగే ఉంటుందని జగ్గారెడ్డి ప్రసంగించినట్లు వీడియోలో ఉంది. అయితే ఈ వ్యాఖ్యలు ప్రస్తుత కలెక్టర్లను ఉద్దేశించి తాను అనలేదని గత ప్రభుత్వంలో కలెక్టర్లపై మాట్లాడినట్లు జగ్గారెడ్డి వివరణ ఇచ్చారు. ఆ తరువాత మీడియాపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మగ కలెక్టర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను తప్పుగా చూపారన్నారు. తాను ఒకటి చెబితే పలు టీవీ ఛానళ్లు మరోటి ప్రసారం చేస్తున్నాయంటూ ఫైర్ అయ్యారు. అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానంటూ హెచ్చరించారు. తనను అప్రతిష్ఠపాలు చేసే విధంగా దుష్ప్రచారం చేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా, టీవీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని వార్నింగ్ ఇచ్చారు. అయితే వీరిద్దరే కాకుండా మరికొంతమంది నేతలు కూడా మీడియా ముందు ఇష్టం వచ్చినట్లు మాట్లాడం కూడా పార్టీకి మైనస్‌గా మారిందని చెప్పుకోవచ్చు. ఈ నేపథ్యంలో పీసీసీ ముఖ్యులు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇకపై ఎవరూ కూడా పార్టీ లైన్ దాటి మాట్లాడకూదని అలా చేస్తే చర్యలు తప్పవని సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ వార్నింగ్ ఇచ్చారు.

## ఇష్టంగా తినే మయోనైస్‌పై నిషేధానికి నిర్ణయం

**మొదటి పేజీ తరువాయి**



సేఫ్టీ విభాగం అధికారులతో సమీక్ష అనంతరం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ మేరకు త్వరలో ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. రాష్ట్రంలో హెూటళ్లు, ఫుడ్‌స్టాల్లలో తరచూ తనిఖీలు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఈ సందర్భంగా మంత్రి సూచించారు. రాష్ట్రంలో కొత్తగా 3 ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 5 మొబైల్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. కల్తీ ఆహారం తీసుకొని పలువురు తీవ్ర అనారోగ్యం పాలవుతున్న ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మయోనైస్‌ను ఎక్కువగా.. మండి బిర్యానీ, కబాబ్‌లు, పిజ్జాలు, బర్గర్లు, శాండ్‌విచ్‌లు, ఇతరత్రా ఆహార పదార్థాల్లో చెట్నీలా వేసుకుని తింటారు. ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలతో బల్దియా ఆహార కల్తీ నియంత్రణ విభాగం అప్రమత్తమైంది. ఎన్నిసార్లు చెప్పినా హెూటళ్లు తీరు మార్చుకోవడం లేదంటూ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆ పదార్థాన్ని నిషేధించేందుకు అనుమతి కోరింది. బంజారాహిల్స్‌లోని నందినగర్, సింగాడకుంట బస్తీ, గౌరిశంకర్ కాలనీలలో గత శుక్రవారం దిల్లీ హాట్ మోమోస్ దుకాణంలో విక్రయించిన మాంసాహార మోమోస్‌ను, వాటితోపాటు ఇచ్చిన మయోనైస్ చట్నీని రేష్మబేగం అనే మహిళ మరణించింది. ఆమె పిల్లలు రుమ్నా, రఫియా ఆస్పత్రి పాలయ్యారు. అల్వాల్‌లోని గ్రిల్ హౌజ్ హెూటల్‌లో నాసిరకం మయోనైస్‌ను తిన్న కొందరు యువకులు ఇటీవల ఆస్పత్రి పాలయ్యారు. వారం కిందట ఐదుగురు యువకులు వాంతులు, విరేచనాలతో స్థానిక ఆసుపత్రిలో చేరడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది జనవరి 10న కూడా ఇలాంటి ఘటనే జరిగింది. అదే హెూటల్‌లో షవర్మ తిన్న 20 మందికిపైగా యువకులు 3, 4 రోజులయ్యాక ఆసుపత్రుల్లో చేరాల్సి వచ్చింది. కొంత మందికి రక్త పరీక్షలు చేయగా హానికర సాల్మనెల్లా బాక్టీరియా ఉన్నట్లు వైద్యులు తేల్చారు. ఆ హెూటల్‌లోని షవర్మ బాగోలేదని బల్దియాకు ఫిర్యాదులు అందాయి. సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్‌లోని ఓ హెూటల్‌లో, టోలిచౌకి, చాంద్రాయణగుట్ట, కాటేదాన్, బంజారాహిల్స్‌లోని పలు హెూటళ్లలోని షవర్మ, మండి బిర్యానీ, బర్గర్లపైనా బల్దియాకు వరుస ఫిర్యాదులు వచ్చాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ హెూటళ్లు, పబ్బులు, బార్ అండ్ రెస్టారెంట్లలో జరిపిన తనిఖీల్లోనూ నాసిరకం మయోనైస్‌ను గుర్తించారు. ఉడికించని పదార్థమైనందున మయోనైస్‌లో హానికర బాక్టీరియా విపరీతంగా వృద్ధి చెందుతుంది. మయోనైస్‌ను గుడ్డులోని పచ్చసొన, నిమ్మరసం, నూనె, ఉప్పుతో తయారు చేస్తారు.'

## బీసీ రిజర్వేషన్‌ల అమలుపై సర్కార్ కి హైకోర్టు ఆదేశాలు

**మొదటి పేజీ తరువాయి**

డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు బుధవారం హైకోర్టులో జరిగిన వాదనల అనంతరం జస్టిస్ ఎస్.నంద ఏకసభ్య ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందుకు సంబంధించి జస్టిస్ ఎస్.నంద ఏకసభ్య ధర్మాసనం ముందు సీనియర్ అడ్వకేట్, మాజీ అడ్వకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్ పిటీషనర్ పక్షాన వాదనలను వినిపించారు. అనంతరం జస్టిస్ ఎస్.నంద, ఏకసభ్య ధర్మాసనం పిటీషనర్ ఆర్.కృష్ణయ్య ప్రజాప్రయోజన వ్యాజ్యంలో లేవనెత్తిన అంశాలను సమర్థించింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర బీసీ కమిషన్‌కు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్‌ల శాతంను నిర్ణయించేందుకు ప్రత్యేకంగా బాధ్యతలను అప్పగించింది. దీనిపై బీసీలకు రాజకీయ రిజర్వేషన్‌లలో ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా ఉండేందుకు వీలుగా హైకోర్టులో సవాల్ చేస్తూ రిట్ పిటిషన్ వేశారు. ఆర్.కృష్ణయ్య వ్యాజ్యాన్ని ఏకసభ్య ధర్మాసనం పరిశీలించి వాదనలు విన్నది. రిజర్వేషన్లపై అధ్యయాన్ని బీసీ కమిషన్‌కు అప్పజెప్పడం సరికాదని హైకోర్టు తెలిపింది. బీసీ కమిషన్‌కు అప్పగించడం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమని హైకోర్టు పేర్కొన్నది. ఈ క్రమంలోనే వెంటనే చర్యలు చేపట్టాలని కోర్టు ఆదేశించింది. హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం రాష్ట్రప్రభుత్వంను 'డెడికేటెడ్ కమిషన్'ను నియమించాలని ఆదేశించడంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హర్షం ప్రకటించారు. ప్రభుత్వం ఇప్పటికైనా హైకోర్టు తీర్పును గౌరవించి వెంటనే నిపుణులతో కూడిన 'డెడికేటెడ్ కమిషన్'ను నియమించాలని ఆయన కోరారు.

## జీహెచ్ఎంసీ ఉద్యోగులకు రెండు రోజుల ముందే జీతాలు

### రూ.120 కోట్లను విడుదల చేసిన ప్రభుత్వం



హైదరాబాద్, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): జీహెచ్ఎంసీ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దీపావళి కానుక అందించింది. రెండు రోజుల ముందే జీతాలు విడుదల చేసింది. ఉద్యోగుల జీతాల చెల్లింపునకు రూ.120 కోట్లను ప్రభుత్వం విడుదల చేయడంతో జీహెచ్ఎంసీ ఉద్యోగులు పండగ చేసుకుంటున్నారు. గతంలో 5వ తేదీ వరకు జీతాల కోసం జీహెచ్ఎంసీ ఉద్యోగులు ఎదురుచూడాల్సి వచ్చేది. ఇదిలా ఉండగా జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల్లో ఫేషియల్ అటెండెన్సీ విధానం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. సంస్థలోని మొత్తం 14 విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ముఖాన్ని మొబైల్ బేస్డ్ యాప్ ద్వారా క్యాప్చర్ చేయడం ద్వారా అటెండెన్స్ నమోదు అవుతుంది. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పనిచేస్తుంది. జీహెచ్ఎంసీ పరిధిలోని మొత్తం 39 విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది హాజరును ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ సిస్టమ్ ద్వారా నమోదు చేస్తున్నారు. ఇంతకు ముందు కార్పొరేషన్ పరిధిలో ఆధార్ ఆధారంగా బయోమెట్రిక్ హ్యాండ్ హెల్డ్ డివైజ్‌తో అటెండెన్స్ నమోదు చేసేవారు. ఈ సిస్టమ్‌తో పారిశుధ్య కార్మికులు దుర్వినియోగం చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో తొలగించారు. ఆ తర్వాత నుంచి జీహెచ్ఎంసీ పరిధిలోని శానిటరీ వర్కర్స్ కు ఫేషియల్ రికగ్నీషన్ అటెండెన్స్ ను అమలు చేస్తున్నారు. ఈ విధానంతో పారదర్శకంగా, కచ్చితత్వంతో కూడిన అటెండెన్స్ నమోదు అవుతుందని జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు.

## విడుదలైన గ్రూప్-3 పరీక్షల షెడ్యూల్




హైదరాబాద్, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల గ్రూప్-3 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. కాగా ఈ పోస్టుల భర్తికి సంబంధించిన పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు నిర్వహించనున్నారు. వచ్చే నెల 17న రెండు సెషన్లలో రెండు పేపర్లకు పరీక్ష ఉంటుంది. 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు మొదటి సెషన్‌లో ఫస్ట్ పేపర్ పరీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి 5:30 వరకు సెకండ్ పేపర్ పరీక్ష జరుగుతుంది. 18న తేదీన పేపర్-3 ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు జరుగునుంది. కాగా పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను నవంబర్ 10వ తేదీ నుంచి అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అవకాశం కల్పించింది. ఈ %+తీశీబజూ%-3 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌కు లాగిన్ అయ్యి తమ హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఇదిలా ఉంటే 1,388 పోస్టు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5,36,477 మంది దరఖాస్తు చేసుకున్నారు.

## విద్యార్థులకు మేలు చేకూరేలా ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): దీపావళి పండగపూట తెలంగాణ సర్కార్ మరో గుడ్ న్యూస్ తెలిపింది. రాష్ట్రంలోని గురుకుల, హాస్టల్స్ విద్యార్థులకు మేలు చేకూరేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని రకాల గురుకులాలు, పలు సంక్షేమ హాస్టళ్లు, వసతి గృహాల్లోని విద్యార్థుల కాస్మోటిక్స్, డైట్ చార్జీలను పెంచింది. ప్రస్తుతం 3 నుంచి 7వ తరగతి వరకు ఉన్న డైట్ ఛార్జీలు రూ.950గా ఉన్న డైట్ ఛార్జీలు రూ.1330కి పెంచారు. 8 నుంచి 10వ తరగతి వరకు రూ.1100 నుంచి రూ.1540కి పెంచారు. ఇక ఇంటర్ నుండి పీజీ వరకు రూ.1500 నుంచి రూ. 2100కి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక కాస్మోటిక్ ఛార్జీలు 3 నుంచి 7వ తరగతి వరకు ప్రస్తుతం రూ.55 ఉండగా దానిని రూ.175కి పెంచారు. 8 నుంచి 10వ తరగతి వరకు రూ.75 నుంచి రూ.275 వరకు పెంచారు. దీనివలన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7.65 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

## ట్రాఫిక్ సమస్య నియంత్రణకు రంగంలోకి డీఆర్ఎఫ్ సిబ్బంది




హైదరాబాద్, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య గురించి అందరికీ తెలిసిందే. నగరంలో ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా హైడ్రా కీలక నిర్ణయం తీసుకుంది. హైడ్రాలోని డీఆర్ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దించింది. మొదటి విడతగా ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బంది నగరంలో విధులు నిర్వహిస్తున్నారు. నగరంలోని గోషామహాల్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో డీఆర్ఎఫ్ సిబ్బందికి ట్రైనింగ్ ఇచ్చారు. హైడ్రా ట్రాఫిక్ వాలంటీర్‌ల పేరిట నగరంలోని ముఖ్యమైన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులకు తోడుగా సేవలు అందిస్తున్నారు. అసెంబ్లీ, ఖైరతాబాద్ చౌరస్తా, తెలుగు ఫ్లైఓవర్, ఎంజే మార్కెట్ సిగ్నల్ వద్ద బుధవారం వాలంటీర్లు ట్రాఫిక్ నియంత్రణ చేశారు. కాగా, భారీ వర్షాలు, వరదలు, ప్రకృతి విపత్తులు వచ్చిన సమయంలో ఈ డీఆర్ఎఫ్ సిబ్బంది విధులు నిర్వహించే వారు ట్రాఫిక్ రద్దీ, ఇతర ముఖ్యమైన సమయాలలో పోలీసులకు సహకరించే విధంగా హైడ్రా ట్రాఫిక్ వాలంటీర్ల సేవలుంటాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ గతంలో చెప్పారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# మరో యుద్ధం తప్పదా....

పశ్చిమాసియాలో ప్రతికార యుద్ధం పీక్స్‌కు చేరుకుంది. గొలుసులా కొనసాగుతున్న పరిణామాల మధ్య యుద్ధంలో చివరి అంకం మొదలైనట్లే కనిపిస్తోంది. దాదాపు ఐదు దేశాల్లోని మిలీషియాతో తలపడుతున్న ఇజ్రాయెల్.. చివరిగా ఇరాన్‌పై దృష్టి పెట్టింది. 45 ఏళ్ల తర్వాత ఇరాన్‌కు ఇజ్రాయెల్‌కు మధ్య ప్రత్యక్ష యుద్ధం షురూ అయ్యిందనే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తానికి మిడిల్ ఈస్ట్, అత్యంత భయంకరమైన పరిస్థితుల మధ్య అల్లాడుతోందిమిడిల్ ఈస్ట్‌లో ప్రధాన ప్లేయర్ల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ రెండు దేశాలూ తలపడితే మధ్య ప్రాచ్యం మసై పోతుందేమో అనే అనుమానాలు ఇప్పుడు మరింత ఎక్కువయ్యాయి. అక్టోబరు 1న, ఇరాన్ ఇజ్రాయెల్‌పై ప్రయోగించిన క్షిపణి దాడికి 25 రోజుల తర్వాత ఇజ్రాయెల్ ప్రతిస్పందించింది. ఇరాన్‌పై "ఖచ్చితమైన దాడులు" అనే పేరుతో అక్టోబర్ 26 తెల్లవారుజామున బాంబుల వర్షం కురిపించింది. గత కొన్ని నెలలుగా ఇరాన్ ఇజ్రాయెల్‌పై చేస్తున్న నిరంతర దాడులకు ప్రతిస్పందనగా.. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్, ఇరాన్ సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు నిర్వహిస్తుందని ఒక ప్రకటనలో ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని సైనిక స్థావరాలపై సూర్యోదయానికి ముందే ఇజ్రాయెల్ దాడి ముగిసింది. ఇరాన్‌లోని సైనిక లక్ష్యాలపై ఖచ్చితమైన దాడులను నిర్వహించడం ద్వారా ప్రస్తుతానికి ఇజ్రాయెల్ సైన్యం లక్ష్యం నెరవేరిందని పేర్కొంది.అక్టోబరు 1న, ఇరాన్ ఇజ్రాయెల్‌పై దాదాపు 180 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వీటిలో చాలా క్షిపణులను అమెరికా దళాల సహాయంతో నిర్మించిన ఇజ్రాయెల్ వైమానిక రక్షణ వ్యవస్థ కూల్చివేసింది. అయితే, ఇరాన్ చేసిన ఆ దాడి? లెబనాన్‌లోని హిజ్బుల్లాకు, ఇరాన్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ చేసిన వరుస దాడులకు ప్రతిస్పందనగా చేసినట్లు ఇరాన్ పేర్కొంది. అలాగే, హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రల్లాను వైమానిక దాడిలో చంపేసింది ఇజ్రాయెల్. ఆ తర్వాత, సరిహద్దుల గుండా దక్షిణ లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ సైన్యాన్ని పంపింది. లెబనాన్‌పై కూడా వైమానిక దాడులు తీవ్రతరం చేసింది. ఈ దాడుల్లో హిజ్బుల్లాను తుడిచిపెట్టేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. దీనితో లెబనాన్‌లో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఆకస్మిక దాడులతో లెబనాన్ అల్లకల్లోలం అయ్యింది., ఈ ఏడాది ఏప్రిల్‌లో కూడా ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో దాడులు చేసింది. దశాబ్దాలుగా ఇజ్రాయెల్‌పై దాడులు చేయడానికి ఇరాన్ ప్రాక్సీలుగా మిడిల్ ఈస్ట్‌లోని పలు తీవ్రవాద గ్రూపులను వినియోగించుకుంటుంది. అయితే, ఇటీవల కాలంలో ఇరాన్ నేరుగా ఇజ్రాయెల్‌పై చేసిన దాడి మాత్రం ఏప్రిల్ నెలలోనే జరిగింది. నిజానికి, ఇజ్రాయెల్‌పై పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్ ఆకస్మిక దాడి ప్రారంభించిన మరుసటి రోజు, అంటే, గతేడాది అక్టోబర్ 8 నుండి ఇజ్రాయెల్, హిజ్బుల్లా సరిహద్దు కాల్పుల యుద్ధంలో ఉన్నారు.యుద్ధం తీవ్రమయ్యి గాజాలో ఇజ్రాయెల్ దాడులపై అంతర్జాతీయంగా విమర్శలు కూడా వచ్చాయి. గాజా స్ట్రిప్‌ని బాంబులతో జల్లెడ పట్టిండి ఇజ్రాయెల్. పదుల సంఖ్యలో హమాస్ అగ్ర నాయకత్వాన్ని అంతం చేస్తూ వచ్చింది. అయితే, హమాస్‌కు సంఘీభావంగా లెబనాన్ కేంద్రంగా నడుస్తున్న హిజ్బుల్లా ఇజ్రాయెల్‌పై రాకెట్లను కాల్చడం ప్రారంభించింది. దీనితో, కొన్ని రోజులు ఇజ్రాయెల్-హిజ్బుల్లా యుద్ధం భీకరంగా కొనసాగింది. ఇక, ఇరాన్ బ్యాకప్‌గా ఉన్న ఈ గ్రూపులపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో అప్పుడప్పుడు ఇరాన్ కూడా కలుగజేసుకుంటూ ఉంది. అదే, తాజాగా ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి చేయడానికి కారణం అయ్యిందియుద్ధం మొదలైనప్పటి నుండీ ఇజ్రాయెల్‌కు అమెరికా సహకారం ఎక్కువగా ఉంది. ఎర్రసముద్రంలో ఇజ్రాయెల్‌కు వెళ్లి వచ్చే ఓడలపై దాడి చేస్తున్న హౌతీ తీవ్రవాదులను ఎదుర్కోవడం దగ్గర నుండీ ఇజ్రాయెల్‌కు ఆయుధ సహకారం, సైనిక శిక్షణా సహకారం వంటివి అందిస్తూనే ఉంది. అయితే, ఇరాన్‌పై చేస్తున్న దాడుల్లో మాత్రం అమెరికా నేరుగా పాల్గొనలేదని పేర్కొంది. అయితే, యూఎస్ ప్రెసిడెంట్ బైడెన్, ఇతర ఉన్నతాధికారులు ఇజ్రాయెల్ చేస్తున్న నిర్దిష్ట లక్ష్య దాడులను కొనసాగించమని ప్రోత్సహిస్తున్నారు. ఇరాన్‌పై తాజా దాడి కూడా అందులో భాగంగానే జరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక, ఈ దాడులకు ఇరాన్ ప్రతిస్పందిస్తే, దాని నుండి ఇజ్రాయెల్‌ని రక్షించడానికి యునైటెడ్ స్టేట్స్ సిద్ధంగా ఉందని, ఇజ్రాయెల్ వైమానిక రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడానికి అధికారులు రెడీ ఉన్నారని అమెరికా వెల్లడించింది.ఇజ్రాయెల్ తాజాగా చేసిన దాడులను ఇరాన్ రక్షణ వ్యవస్థ అడ్డుకున్నట్లు ఇరాన్ పేర్కొంది. దీనివల్ల "పరిమిత నష్టం" మాత్రమే జరిగిందని ఇరాన్ వెల్లడించింది. అక్టోబర్ 26 తెల్లవారుజామున ఇరాన్ వ్యాప్తంగా సైనిక కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి చేసినట్లు తెలిపింది. టెహ్రాన్, ఖుజెస్తాన్, ఇలాం ప్రావిన్సులలోని సైనిక కేంద్రాలలోని కొన్ని భాగాలపై ఈ దాడి జరిగినట్లు ఇరాన్ నివేదించింది. "ఈ దాడిని ఇరాన్ సమగ్ర వాయు రక్షణ వ్యవస్థ విజయవంతంగా అడ్డుకుందని వెల్లడించింది. టెహ్రాన్‌తో పాటు దేశం చుట్టూ అనేక ప్రాంతాలలో వైమానిక రక్షణను మోహరించినట్లు ఇరాన్ అధికారులు చెప్పారు.అయితే, "ఇటీవల కాలంలో ఇరాన్ చేసిన దాడులకు ప్రతిస్పందన ఈ తాజా దాడితో ముగిసిందనీ.. ఇజ్రాయెల్‌కు ఉన్న తక్షణ బెదిరింపులను అడ్డుకున్నామని" ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ వెల్లడించింది. "ఇక ఇరాన్ కొత్తగా మరో రౌండ్ దాడులు ప్రారంభిస్తే.. ఇజ్రాయెల్ మరింత తీవ్రంగా ప్రతిస్పందస్తుందని" హెచ్చరికలు కూడా చేశారు. ఈ విషయంలో ఇజ్రాయెల్ స్పష్టంగా ఉందనీ.. ఇజ్రాయెల్‌ను ఇంకా ఎవరైనా బెదిరించే ప్రయత్నం చేసినా.. ఈ యుద్ధాన్ని ఇంకా విస్తరించాలని కోరుకున్న పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పేర్కొంది. ఇజ్రాయెల్‌కు హాని కలిగించాలని కోరుకునే వారందరూ దానికి భారీ మూల్యం చెల్లించవలసి ఉంటుందని వెల్లడించారు. "నిర్ణయాత్మకంగా వ్యవహరించే సామర్థ్యం, సంకల్పం రెండూ ఇజ్రాయెల్ దగ్గర ఉన్నాయని ఈ రోజు నిరూపించమని" అన్నారు. ఇజ్రాయెల్ ప్రజలను రక్షించడానికి ఎలాంటి నేరమైన చేస్తామని, ఇజ్రాయెల్ ప్రజల రక్షణ కోసం సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్షా సమావేశం



మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అధ్యక్షతన 24-25, సంవత్సరం వానాకాలం సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అందుకు సంబంధించి ఐకెపి (64) సహకార శాఖ (153) గిరిజన కోపరేటివ్ కార్పొరేషన్ (11) ఇతరులు 6 మొత్తం (234) దాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపామని, సన్న రకాలు, దొడ్డు రకాలు, కేంద్రాలను వేరువేరుగా ఏర్పాటు చేయనున్నట్లు, ప్రభుత్వ సూచనల మేరకు మాయిశ్చర్ వచ్చేంతవరకు చూసి కేంద్రాలకు దాన్యం తీసుకురావాలన్నారు. టార్పాలిన్స్ సిద్ధంగా ఉంచుకోవాలని, కొనుగోలు చేసే ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని జియో ట్యాగింగ్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ధాన్యం తీసుకువచ్చే రైతుకు వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి అవగాహనను కల్పించాలని తద్వారా వెంట వెంటనే వారి అకౌంట్లో డబ్బులు జమవుతాయని తెలిపారు. సివిల్ సప్లై, వ్యవసాయ, మార్కెటింగ్, ట్రాన్స్పోర్టేషన్, రెవెన్యూ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ ప్రేమ్ కుమార్, డి ఆర్ డి ఓ మధుసూదన్ రాజు, డి సి ఓ వెంకటేశ్వర్లు, డి హెచ్ ఓ మరియన్న, వ్యవసాయ శాఖ ఏడి మురళి, లీగల్ మెట్రోలజీ విజయ్ కుమార్, ఆర్టీవో సాయి చరణ్, మెప్మా పీడీ విజయ, డిఎం మార్కెటింగ్, తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికలో ప్రారంభమైన దేశి శిక్షణ కార్యక్రమం

## ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి






ములుగు, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): బుధవారం ములుగు మండలంలోని ములుగు రైతు వేదికలో దేశి శిక్షణ కార్యమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కర్యమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి, ములుగు తేజోవతి, మరియు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. ఆర్.ఉమ రెడ్డి హాజరు ఐయినారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశి శిక్షణ కార్యక్రమములో వివిధ మండల నుండి 80మంది డీలర్లకు 40 వారాలు శిక్షణ ఉండును.ఈ శిక్షణ లో డీలర్లకి వ్యవసాయం మీద పూర్తి అవగాహన కల్పించి వారికి మేనేజ్ నుండి కోర్సు సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంది. దేశి శిక్షణ పొందిన డీలర్ తమ వద్దకు వచ్చిన రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు మరియు మందులు సరఫరా చేయాలి మరియు వాళ్ళకి పంటల మీద అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమంలో ఏడిఏ ములుగు వి.సురేష్ కుమార్, ఏడిఏ ఎటురునాగరం న్.చేరాలు, దేశి ఫెసిలిటేటర్ బి. స్వామి, మండల వ్యవసాయ అధికార్లు, బ్యాచ్ 1, 2 డీలర్లు హాజరైయ్యారు.

# జిల్లా ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ దీపావళి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలంటూ ప్రజలకు పలు సూచనలు చేశారు. బాణాసంచాలు కాల్చే సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ముఖ్యంగా చిన్నారులు పెద్దల సమక్షంలో బాణాసంచాలు కాల్చు విధంగా చూడాలని సూచించారు. బాణసంచా విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్, పురపాలక మరియు పంచాయతీ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. బాణసంచా దుకాణాల వద్ద రక్షణ చర్యలు పాటించాలని, ఎక్కడ పడితే అక్కడ బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌లో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని, వాహనదారులు బాణసంచా దుకాణాలకు దూరంగా పార్కింగ్ చేయాలని సూచించారు. ఏదేని ప్రమాదం వాటిల్లితే తక్షణ చర్యలు చేపట్టేందుకు అగ్నిమాపక వాహనాలు, ఇసుక మరియు నీళ్ల డ్రములు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఈ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలను, కొత్త వెలుగులను నింపాలని ఆకాంక్షిస్తూ, జిల్లా ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# సామాజిక ఆర్థిక సర్వేకు ప్రత్యేక అధికారును నియమిస్తూ ఉత్తర్వులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): సామాజిక ఆర్థిక సర్వే ప్రక్రియ పర్యవేక్షణకు నోడల్ అధికారిని, కోర్ కమిటీ అధికారులను, మండల ప్రత్యేక అధికారును నియమిస్తూ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా కోర్ కమిటీ అధికారులు గా కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సిపిఓ బాబూరావు, ఆర్డిఓ మంగిలాల్, మండల, మున్సిపల్ ప్రత్యేక అధికారులుగా జిల్లా అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. భూపాలపల్లికి జిల్లా పంచాయతీ అధికారి నారాయణ రావు, మహ ముత్తారంకు ఎస్సి కార్పొరేషన్ ఈడి ఎం వెంకటేశ్వర్లు, కాటారంనకు జిల్లా ఉద్యాన వనశాఖాధి కారి డి సంజీవరావు, భూపాలపల్లి మున్సిపాలిటీ కి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఏ సిదార్థ రెడ్డి, రేగొండ కు జిల్లా భూగర్భ జల వనరుల అధికారి కె శ్రీనివాస్, చిట్యాలకు జిల్లా సంక్షేమ అధికారి కె చిన్నయ్య గణపురంకు జిల్లా పశు సంవర్ధక అధికారి కె కుమారస్వామి, మల్హర్ కు జిల్లా మత్యశాఖ అధికారి, ఏ అవినాష్, మొగళ్లపల్లి కి జిల్లా ఎస్సి అభివృద్ధి అధికారి డి సునీత, పలిమెల కు జిల్లా వ్యవసాయ అధికారి ఎం విజయ భాస్కర్ టేకుమట్లకు జిల్లా బిసి సంక్షేమ అధికారి శైలజ, మహాదేవపూర్ కు డివిజనల్ పంచాయతి అధికారి వీరభద్రయ్య, కొత్తపల్లి ఘోరి కి సహాయ గ్రామీణాభివృద్ధి అధికారి మంజులా దేవి లను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

# అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ ను తనిఖీ చేసిన అధికారులు

## పిడిఎస్ బియ్యం వాహనాలను సీజ్ చేయాలనీ ఆదేశాలు




వాజేడు, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా వాజేడు మండలంలోని పేరూరు గ్రామంలో గల అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ ను పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బి.రాంపతి మరియు వాజేడు మండలం తాసిల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ లో రెవెన్యూ వ్యవసాయ శాఖ మరియు పోలీస్ శాఖల నుండి నియమించబడిన సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్పోస్టులో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వరి దాన్యంకు సంబంధించిన వాహనాలను నిరంతరం తనిఖీ చేయాలని సరైన పత్రాలు ఉంటేనే అనుమతించాలని లేనిచో అట్టి వాహనాలను సీజ్ చేసి వెంటనే పై అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు అలాగే తెలంగాణ రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లే సీఎంఆర్ బియ్యము మరియు పిడి ఎస్ బియ్యం వాహనాలను తనిఖీ చేసి వెంటనే జప్తు చేయాలనీ ఆదేశించారు. పిడిఎస్ బియ్యం రాక పోకల వాహనాలను వెంటనే సీజ్ చేయాలనీ ఆదేశించారు.అదేవిధంగా చెక్‌పోస్ట్‌లో వాహనాలు రాకపోకల సమాచారాన్ని ఒక రిజిస్టర్లో నమోదు చేసి జిల్లా పౌరసరఫరాల అధికారికి నిరంతరం సమాచారం ఇవ్వవలసిందిగా ఆదేశించారు.

# నవంబర్ 2న జిల్లాకు బీసీ కమిషన్ సభ్యులు రాక

## కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

వరంగల్ జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): స్థానిక సంస్థల రిజర్వేషన్ల కల్పనపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా నవంబర్ 2వ తేదీన హనుమకొండ జిల్లా కలెక్టరేట్కు బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం రానున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్య శారదా నేడొక ప్రకటనలో తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి పాల్గొననున్నట్లు తెలిపారు. నవంబర్ 2న ఉదయం 10 నుంచి వరంగల్ ఉమ్మడి జిల్లాలైన వరంగల్, హన్మకొండ, ములుగు, భూపాలపల్లి మహబూబాబాద్, జనగామ జిల్లాలకు సంబం ధించి దరఖాస్తులను స్వీకరిస్తారని వివరించారు. వరంగల్ జిల్లాకు సంబంధించిన ప్రజలు తమ అభిప్రాయాలను, విజ్ఞప్తులను కమిషన్ బృందానికి సమర్పించాలని కలెక్టర్ కోరారు.

# జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఆర్డీవో



హనుమకొండ, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ను హనుమకొండ ఆర్డీవో గా బాధ్యతలు స్వీకరించిన రాథోడ్ రమేష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టరేట్లోని కలెక్టర్ చాంబర్ లో కలెక్టర్ ప్రావీణ్య ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీవో మొక్కను అందజేశారు. అదేవిధంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిని ఆర్డీవో రాథోడ్ రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్ కు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు హనుమకొండలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో గా రాథోడ్ రమేష్ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో కు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.


# జిల్లా ప్రజలకు దీపావళి పర్వదిన శుభాకాంక్షలు

## హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



హనుమకొండ జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా ప్రజలకు దీపావళి పర్వదిన శుభాకాంక్షలను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీపావళి పర్వదినాన్ని కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో జిల్లా ప్రజలు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. జీవితాల్లో చీకట్లు తొలగిపోయి వెలుగులు నిండాలని, అందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుకి అచ్చునూరి కిషన్ సన్మానం



ములుగు, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ని సన్మానించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటీ సభ్యులు అచ్చునూరి కిషన్. బుధవారం ములుగు మండలం ఇంచర్ల లోని ఎమ్.ఆర్ ఫంక్షన్ హాల్లో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ప్రమాణ స్వీకారమహొత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటీ సభ్యులు అచ్చునూరి కిషన్ హజరై రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా'తో సన్మానించి హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బండి రమేష్, మోహన్ దాస్, విజయ్, ప్రసాద్, రమేష్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారులకు టోల్ ఫ్రీ సేవలు

**– సత్వర ఫిర్యాదుల పరిష్కారం ఫిర్యాదులకై 1912 నెం.**

ములుగు జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): విద్యుత్ వినియోగదారులకు టోల్ ఫ్రీ సేవలు మరింత విస్తృతం ప్రజలకు 24/7 అందుబాటులో టోల్ ఫ్రీ నంబర్ సాంకేతికతను జోడించి సత్వర ఫిర్యాదుల పరిష్కారం ఫిర్యాదులకై 1912 సంప్రదించండి సంబంధిత అధికారులు ప్రకటన చేశారు. టిజిఎన్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించే క్రమంలో టోల్ ఫ్రీ సేవలను మరింత విస్తృత పరిచామని, బి.మల్చూర్ భూపాలపల్లి సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ మరియు పి.నాగేశ్వర్రావు ములుగు డివిజనల్ ఇంజనీర్ తెలిపారు. కార్పొరేట్ కార్యాలయం నుండి టోల్ ఫ్రీ సేవలు నిర్వహించబడుతున్నాయని, భూపాలపల్లి జిల్లా మరియు ములుగు జిల్లా విద్యుత్ వినియోగదారులు ఈ టోల్ ఫ్రీ సేవలను సద్వినియోగ పరుచుకోవాలని తెలిపారు. సాంకేతికతను జోడించి సిబ్బందిని పెంచి టోల్ ఫ్రీ సేవలను మరింత పటిష్టపరిచామని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 1912 అని తెలిపారు. ప్రతి ట్రాన్స్ఫార్మర్ పై టోల్ ఫ్రీ నంబర్ 1912 ను ముద్రిస్తున్నామని అన్నారు. ప్రజల్లోకి విస్తృతంగా ఈ టోల్ ఫ్రీ నంబర్ ను తీసుకువెళుతున్నామని చెప్పారు. ట్రాన్స్ఫార్మర్ల ఫేయిల్యూర్లు, విద్యుత్ సరఫరాలో ఏటువంటి ఇబ్బందులు తలెత్తిన, బిల్లులో ఏమైనా హెచ్చుతగ్గులు ఉన్న, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, అన్ని రకాల కొత్త సర్వీసుల మంజూరుకు సంబంధించిన పేరు మార్పు, క్యాటగిరి మార్పు, లోడ్ మార్పు తదితర సమస్యల కొరకు టోల్ ఫ్రీ నంబర్ 1912 సంప్రదించి సేవలు పొందగలరని కోరారు. ఇందులో భాగంగా విద్యుత్ వినియోగదారుడు ముందుగా 1912 కు ఫోన్ చేయగానే అట్టి ఫిర్యాదును స్వీకరించి, స్వీకరించిన ఫిర్యాదును నమోదు చేసి, నమోదు తాలూకు సమాచారాన్ని సంబంధిత అధికారికి వెళ్తుంది,అలాగే ఫిర్యాదుదారునికి మెసేజ్ రూపంలో సంబంధిత అధికారికి పంపడం జరుగుతుందని తెలుపుతారు. అట్టి ఫిర్యాదు ఆ అధికారి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటారన్నారు. 1912 పై వచ్చిన ఫిర్యాదులను ఉన్నత స్థాయి అధికారులు సమీక్షను నిర్వహించడం జరుగుతుందన్నారు. సమీక్షా చేయడం వలన త్వరితగతిన పరిష్కారం అవుతాయాని వివరించారు. వినియోగదారుల ఫిర్యాదులు సత్వర పరిష్కారం కావడానికి టోల్ ఫ్రీ నంబర్లు ఎంతగానో దోహద పడుతుందని తెలిపారు. వినియోగదారుల అభిప్రాయం కూడా తీసుకోబడుతుందని అన్నారు

# బీఆర్ఎస్ నాయకులతో చల్లా సమావేశం



పరకాల నియోజకవర్గం, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): నియోజకవర్గంలోని సంగెం మండల బిఆర్ఎస్ ముఖ్య నాయకులతో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం హనుమకొండలోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలో గ్రామాలలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. గ్రామాలలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్న పరిస్థితులు ప్రస్తుతం లేవని, రైతుబంధు, రైతుభీమ రాక, విద్యుత్ సరఫరా సరిగా లేక రైతులు కష్టాలుపడుతున్నారని, ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్క హామీ అమలు చేయకపోవడం తో ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని,పరిపాలన కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేయడం తో గ్రామాల్లో పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మండల నాయకులు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ గ్రామాల వారీగా కార్యకర్తలతో కలిసి సమావేశాలు నిర్వహించాలని సమన్వయ కమిటీ సభ్యులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. మండల స్థాయి నాయకులు గ్రామాల్లోని కార్యకర్తలకు ఏదైనా సమస్యల ఎదురైతే పరిష్కరించాలన్నారు. అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు ఎవరు భయపడాల్సిన అవసరం లేదన్నారు.మీకు అండగా ఎల్లప్పుడూ ఉంటానని భరోసా ఇచ్చారు. ఆరు గ్యారెంటీల హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో తీసుకెళ్ళాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరై ఇండ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేసిన వారికి బిల్లుల గురించి నాయకులు మాజీ ఎమ్మెల్యేని అడగగా బిల్లుల మంజూరుపై కోర్టులో కేసు నడుస్తున్నదని, త్వరలోనే సానుకూలంగా తీర్పు వస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో మండల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**



వరంగల్ జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ కోసం ఏర్పాటు చేసిన అధికారుల బృందాలుక్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి ఆ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. బుధవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియ పురోగతి, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 31 వేల 800 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా, అందులో 1957 దరఖాస్తులు మాత్రమే పరిశీలించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులు అలసత్వాన్ని వీడి అంకితభావంతో దరఖాస్తుల పరిశీలన వేగిరం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ పరిశీలన కోసం ఏర్పాటు చేసిన ప్రతి బృందం ప్రతిరోజు ఖచ్చితంగా ఇరవై దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను అదే రోజు అందజేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఏర్పాటుచేసిన రెవెన్యూ, మున్సిపల్, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పరిశీలన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి రత్నకుమారి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డెప్యూటీ సిటీ ప్లానర్ రవీంద్ర రడెకర్ సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు రైస్ మిల్లర్లు సహకరించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**



హనుమకొండ జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి జిల్లాలో కొనసాగుతున్న దాన్యం కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, డిఆర్డిఏ, అధికారులు, రైస్ మిలర్లతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జీవో 27 ప్రకారం 10శాతం బ్యాంకు గ్యారంటీ, లేదంటే సెక్యూరిటీ డిపాజిట్ ను సమర్పించినట్లయితే ధాన్యాన్ని కేటాయిస్తామని పేర్కొన్నారు. దాన్యం కొనుగోలు ప్రక్రియలో ఒక్కో రైసు మిల్లులకు ఒక్కో వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించడం జరుగుతుందన్నారు. వారం రోజుల లోపు బ్యాంకు లేదా సెక్యూరిటీ డిపాజిట్ ను రైస్ మిల్లర్లు సమర్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లర్లు సహకరించాలని కలెక్టర్ కోరారు. సన్న, దొడ్డు రకం ధాన్యాల లోడులను వేరువేరుగా రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే 24 గంటల్లోగా అధికారులు పరిష్కరించాలన్నారు. నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఆర్డిఓ నాగ పద్మజ, జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ కొనుగోళ్లు జరగాలి

**జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా**



జనగామ జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): బుధవారం లింగాల ఘనపురం మండలం పటేల్ గూడెం, జనగాం మండలం పెంబర్తి లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆలస్యం లేకుండా ఎప్పటికప్పుడు కొనుగోళ్లు జరగాలని ఏ కేంద్రం లోను ఎలాంటి సమస్య రాకూడదని అధికారులకి తెలిపారు. తేమ శాతాన్ని సరిగ్గా నిర్దారించాలని కొనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. అన్ని కేంద్రలలో మెడికల్ కిట్స్ అందుబాటులో ఉండాలన్నారు. రైతులకి ఏమైనా అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే స్పందించి తగు టాబ్లెట్ ఇవ్వాలన్నారు. కొనుగోలు కేంద్రలాలో సమస్య లు ఏమైనా ఎదురైతే తమ దృష్టి కి తీసుకవస్తే తప్పకుండ పరిష్కరిస్తామని అక్కడ ఉన్న రైతులకు కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలను,కొనుగోలు, చెల్లింపులకు, గన్ని సంచులకు సంబందించిన వివరాలని, రిజిస్టర్ లను, ఆన్లైన్ ప్రక్రియ ను ఈ సందర్భంగా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

# సర్వే వివరాలు సమగ్రంగా నమోదు చేయాలి

**– జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. బుధవారం కలెక్టర్ జిల్లా కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్ లో మున్సిపల్ పరిధిలో చేపట్టబోయే సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సర్వే వివరాల నమోదు పై ఏర్పాటు చేసిన మండల స్థాయి ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎన్యూమరేటర్ లు పూర్తి స్థాయిలో అవగాహన పొందాలన్నారు. జిల్లా కోడ్ 19, మున్సిపల్ కోడ్ 01లను తప్పక నమోదు చేయాలన్నారు. మున్సిపాలిటీలో ఉన్న 30 వార్డులలో ఏ ఒక్క ఇంటిని కూడా విడిచి పెట్టారాదన్నారు. సేకరించిన వివరాలు గోప్యంగా ఉంచాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో తెలియనివ్వరాదన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జనగామ ఆర్డీఓ గోపిరామ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మేనేజర్ రాములు, జిల్లా పరిశ్రమల అధికారి సతీష్, చేనేత జౌళి శాఖ అధికారి చౌడేశ్వరి, మండల మాస్టర్ ట్రైనర్ లు పాల్గొన్నారు.

# 118 కేజీల గంజాయి పట్టివేత

**– రెండు ఆటోలు స్వాధీనం**

**– ఇద్దరు వ్యక్తుల అరెస్ట్.. పరారీ లో ఒకరు**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): ఒరిస్సా కలిమెల నుంచి హైదరాబాద్ కు ఆటోలో అక్రమంగా తరలి వెళ్తున్న గంజాయిని బుధవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే ఒరిస్సా కలిమెళ్ల నుంచి హైదరాబాద్ కు రెండు ఆటోలో గంజాయి వెళుతుందని సమాచారం మేరకు, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అండ్ ఎక్సైజ్ పోలీసులు కలిసి ఆర్టీవో చెక్పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు. అనుమానంగా వచ్చినటువంటి రెండు ఆటల్లో తనిఖీలు నిర్వహించగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయిని వేయగా 118 కేజీలుగా ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు నిర్ధారించారు. గంజాయితో పాటు రెండు ఆటో లను ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి పరారయ్యాడని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. పట్టుకున్న గంజాయి, వాహనాల విలువ కలిపి రూ. 31.50 లక్షలు గా ఉంటుందని ఎక్సైజ్ సూపర్ డెంట్ కరమ్ చందు తెలిపారు. అరెస్టు కాబడిన వ్యక్తుల్లో హైదరాబాద్ కు చెందిన కనిగల స్వాతిక్, మణుగూరు కు చెందిన గుంజు ఆమోస్ ను అరెస్టు చేయగా,సపా వత్ వెంకన్న పరారీ లో ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్.ఐ గౌతమ్ సిబ్బంది రామకృష్ణ గౌడ్, హబీబ్ పాషా, వెంకట నారాయణ, గురవయ్య, సుమంత్, శ్రావణి, రమేష్ పాల్గొన్నారు. గంజాయిని పట్టుకున్నటువంటి టీమును ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్ రెడ్డి, ఎక్సైజ్ సూపరిడెంటు జనార్దన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఎక్సైజ్ సూపర్డెంట్ జానయ్య అభినందించారు.

# ఆదిపత్య పోరుతోనే రిపోర్టర్ హత్యాయత్నం

**పోలీస్ స్టేషన్లో సిఐ చరమంద రాజు ప్రెస్ మీట్**

**హత్యాయత్నానికి పాల్పడ్డ ఆరుగురు రిమాండ్ కు తరలింపు**



పాలకవీడు, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): జర్నలిస్ట్ సందీప్ పై జరిగిన దాడి పూర్తిగా వ్యక్తిగతం సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నట్టు ఇది మతపరమైన గొడవ కాదు సందీప్ అయ్యప్ప మాలలో అని ఉండటం వలన అందరూ అలా భావిస్తున్నారు. హైదరాబాద్ కొరియర్ జాబ్ చేసే సందీప్ రెండు సంవత్సరాల క్రితం జాన్పహాడ్ దర్గా వద్దకు వచ్చి అక్కడ రెండు కిరాణా షాపులు నడుపుతున్నాడు సందీప్ తండ్రి జహంగీర్ తండ్రి శంసుద్దీన్ మంచి స్నేహితులు మొదటినుండి ఇరువురి కుటుంబాలు స్నేహంగా ఉండేవి జాంగిర్ స్వతహాగా కారు డ్రైవర్ సూర్యాపేట ఎక్కువ ఉంటాడు సందీప్ సిక్స్ టీవీ రిపోర్టర్ గా పని చేస్తూ గ్రామంలో ప్రజలకు మంచి చెడులు అందుబాటులో ఉంటున్నాడు సందీప్ పేరు రావడం జాంగిర్ కు నచ్చలేదు అప్పటినుంచి మనసులో పెట్టుకున్నాడు గణేష్ ఉత్త స్వామి ప్లెక్సీ విషయంలో చిన్న గళాట జరిగింది నిమజ్జనం రోజు వారి పక్క గ్రామం కోమటికుంట వారితో గొడవ జరిగింది. అప్పుడు సందీప్ కోమటికుంట గ్రామం వారి వైపు మాట్లాడటం జరిగింది. అలా మాట్లాడటం జంగిర్ కు నచ్చలేదు ఎక్కడి నుండో వచ్చిన వాడికి పేరు వస్తుంది ఆధిపత్యం చాలా ఇస్తున్నాడు ఎలాగైనా సందీప్ ఆధిపత్యానికి తెరదించాలని భావించాడు, ఈనెల 26వ తారీకున దేవుడమ్మ అలియాస్ విజయ రెడ్డి అనే ఆమె కందూరు చేస్తూ జహంగీర్ ని రమ్మని పిలిచింది ఆరోజు జహంగీర్ తన ఫ్రెండ్ పనిందర్ ను వెంటబెట్టుకొని అక్కడికి రావడం జరిగింది వచ్చాక దర్గలో దేవుని దర్శించుకుని ఫ్రెండ్స్ అందరూ కలిసి మందు తాగుతూ సందీప్ అనే వ్యక్తి ఊళ్లో చాలా రకాలుగా మనల్ని ఇబ్బంది పెడుతున్నాడని అనే విషయం గురించి చర్చించుకోవడం జరిగింది గతంలో కూడా జరిగిన గొడవలను ప్రస్తావించడం జరిగింది గతంలో గణేష్ విగ్రహాన్ని సందిపియడం గ్రామస్తులతో దగ్గర అవుతున్నాడని తమ ప్రభల్యం తగ్గిపోతుందని రక్ష పెంచుకోవడం గణేష్ నిమజ్జనం రోజు రెండు గ్రామాల మధ్య గొడవ జరిగితే ఒక గ్రామానికి చెందిన వ్యక్తులకి సందీప్ మద్దతు తెలపడం మరో వర్గానికి నజీర్ మద్దతు తెలపడం మరికొంత గొడవకు దారితీసింది అంతేకాకుండా సందీప్ రిపోర్టర్ కావడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయ అధికారులతో సన్నిహితంగా ఉండి తన వద్దకు వచ్చిన వారికి పనులు చేసి పెడుతుంటే తమకంటే ఎక్కువ ఎదుగుతున్నాడు కక్ష సాధింపు పెంచుకోవడం అదేతనానికి దారి తీసింది అన్నారు. దీంతో సందీప్ కి ఎలాగైనా చెక్ పెట్టాలని ఆలోచనతో ఫ్రెండ్స్ అంతా మాట్లాడుకుని చర్చించి నజీర్ చికెన్ సెంటర్లో పనిచేస్తున్న సైదులు దగ్గరికి పోయి మాకు కత్తి కావాలని అడిగారు సందీప్ అనే వ్యక్తి ఇలా చేస్తున్నాడు అని చెప్పగా సైదులు అనే వ్యక్తి కూడా నేను కూడా వస్తాను అని అందరూ కలిసి సంధిబెంటికి వెళ్లడం జరిగింది సందీప్ ని ముందుగా పలకరించగా సందీప్ కూడా వారిని ఇంట్లోకి తీసుకెళ్లడం జరిగింది గ్రామ విషయాలు చర్చకు రావడంతో మాటా మాట పెరగడంతో ముందుగా అనుకున్న పథకం ప్రకారం కత్తితో సందీప్ పై దాడి చేయడం జరిగింది. వెంటనే సందీప్ గట్టిగా అరవడంతో అక్కడి వాళ్లు వచ్చి సెటర్ లేపగానే సందీప్ అక్కడ బయటకు రావడం జరిగింది. జహంగీర్ తన స్నేహితులు నుంచి పారిపోవడం జరిగింది. వారి బండి ఎర్టిగా కారును పెట్రోల్ బంకు సందులో దాచిపెట్టి వెళ్లడం జరిగింది. ఈరోజు ఆ కారు కోసం వాళ్లు దర్గా దగ్గరికి రావడంతో అమ్మ దగ్గర సమాచారంతో మేము వారు ఒక ఇంట్లో ఉండంగా అక్కడికి వెళ్లి వారిని పట్టుకుని రిమాండ్ కు తరలించడం జరిగింది. ఇది కక్షపూరిత గొడవలు తప్ప రెండు మతాల మధ్య గొడవ కాదు దీనికి ఎటువంటి మత విద్వేషాలతో జరిగింది కాదని అన్నారు. కొందరు సోషల్ మీడియాలో ఈ ఘటనను మరో విధంగా ప్రచారం చేయడం జరిగిందని అన్నారు అదంతా అవాస్తవం అని తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొనే ఎస్సై తో పాటు హుజూర్నగర్ ఎస్ఐ బలరాంరెడ్డి పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్లక్ష్యంతో ప్రాణాల మీదకు తెచ్చు కోకండి

**– దీపావళి సంతోషంగా జరుపుకోండి**

**– ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి**



పెబ్బేరు, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): కుల మత, ప్రాంతాలకు అతీతంగా అందరూ జరుపుకొనే పండుగ దీపావళి అని ఈ పండగను ఆనందంగా ఆహ్లాదకరంగా సంతోషంగా జరుపుకోవాలని పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దీపావళి పండగ ప్రశాంత వాతావరణంలో జరుపు కోవాలని, పిల్లలు బాణాసంచా కాల్చిన సమయంలో పెద్దలు పక్కనే ఉండాలని ఆయన సూచించారు. అనధికారికంగా మందుగుండ అమ్మే వారిపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ కలిగిన బాణాసంచా మాత్రమే వినియోగించాలని, సరదా కోసం నిండు జీవితాలను నాశనం చేసుకోవొద్దని సూచించారు.కాటన్ దుస్తులు ధరించి, నీటి నిల్వలు సిద్ధం చేసుకొని, బాణాసంచా కాల్చాలని ఎస్ఐ సూచించారు. బాణాసంచా కాల్చే విషయంలో ఆజాగ్రత్త వహిస్తే జీవితాలు నాశనం అవుతాయని ఇది గ్రహించి ప్రతీ ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందుగా పెబ్బేరు మున్సిపాలిటీ మరియు మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు

# ఇంటింటి కుటుంబ సర్వేపై సంపూర్ణ అవగాహన ఉండాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



వరంగల్ జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నంబరు 6 నుంచి 18 వరకు నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, రాజకీయ,కుల సర్వే) పై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణితో కలసి కలెక్టర్ సామాజిక, ఆర్థిక, సర్వే మార్గదర్శకాలపై మండలాల ప్రత్యేకాధి కారులు, ఎంపీడీ వోలు, సూపర్వైజర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. సర్వే పారదర్శకంగా ఉండాలని, సర్వే విషయాలను గోప్యంగా ఉంచాలని, ఎలాంటి తప్పులు లేకుండా సర్వే పక్కగా చేయాలని, ఏ ఒక్క విషయం తప్పిపోకుండా అన్ని వివరాలు సేకరించాలని తెలిపారు. వివరాల సేకరణ అనంతరం డేటా ఎంట్రీ సైతం పక్కగా సంబంధిత గణకుడు నిర్వహించాలని చెప్పారు. ఎన్యూమరేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సర్వేకు జిల్లా పరిషతు సీఈఓ జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని అన్నారు. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో గణకులు ఇంటింటికి తిరిగి సర్వే చేస్తారన్నారు. దీనిపై మండల స్థాయిలో గణకులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 2.63 లక్షల కుటుంబాలున్నాయని, 150 కుటుంబాలకు ఒక గణకుడు చొప్పున 1841 గణకులచే సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. 10 మంది గణకులకు ఒక సూపర్వైజర్స్ ను నియమించడం జరిగిందని అన్నారు. సర్వే ప్రక్రియలో సూపర్వైజర్స్ పది శాతం రాండంగా డేటా ఖచ్చితంగా తనిఖీ చేయాలని తెలిపారు. ఇంటి నెంబరు ఆధారంగా సర్వే ఉంటుందని, ఎన్యూమరేటర్లు తు.చ తప్పక ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర సమాచారాన్ని నింపాల్సి ఉంటుందని అన్నారు. ఆధార్ కార్డు ప్రకారం కచ్చితంగా వివరాలు నమోదు చేయాలన్నారు. సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్లు పూర్తిగా శిక్షణ పొంది నిష్ణాతులు కావాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కుటుంబాల సమగ్ర సమాచార సేకరణ చేపట్టాలని సూచించారు. సమగ్ర సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలు చిట్టచివరి పేదవారికి చేరేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సామాజిక, ఆర్థిక, విద్య , ఉపాధి, రాజకీయ, కులాల వారిగా సర్వేలో వివరాలు నమోదులు చేయాలని తెలిపారు. నవంబర్ 3 నుండి 6వ తేదీ వరకు గృహాల లిస్టింగ్ చేసుకొని నవంబర్ 6వ తేదీ నుండి సర్వే ప్రారంభించాలని అన్నారు. ఎన్యుమరేషన్ బ్లాక్ లోని అన్ని కుటుంబాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, నిర్దేశించిన లక్ష్యం మేర బ్లాకు మించితే అదనపు బ్లాకులుగా కేటాయించి నవోదులు చేయాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు వారికి కేటాయించిన ఎన్యూమరేషన్ బ్లాకులో ప్రతి కుటుంబాన్ని క్రమ పద్ధతిలో జాబితా తయారు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఇంట్లో నివసించే వారి సంఖ్యను నిర్ధారించాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించి (ఇంటి నంబరు, ఇంటి యజమాని పేరు వంటి వివరాలు) ఫారంలో నమోదు చేయాలని సూచించారు. సర్వే పూర్తి అయిన తదుపరి వివరాలు నింపిన స్టిక్కర్ ని ఇంటి గోడపై అతికించాలన్నారు. సర్వే నిర్వహణ ఎన్యుమరేటర్లు మార్గదర్శకాలను అనుసరించి సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లు సర్వేలో ప్రజలతో గౌరవంగా, హుందాగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సర్వే యొక్క ప్రధాన ఉద్దేశంపై ప్రజలకి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అందించిన ప్రశ్నావళిని ఉపయోగించి సమాచారాన్ని సేకరించాలని, ప్రతి ఇంటి నుండి స్పష్టత కల్గిన ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. సూపర్వైజర్లు, ఫీల్డ్ ఎన్యుమరేటర్ల పనితీరును పర్యవేక్షించి అవసరమైన సహాయాన్ని అందించాలని, ఏదేని సందేహాలు వస్తే వారి సందేహాలను నివృత్తి చేయాలన్నారు. అనంతరం సర్వేకు సంబంధించిన ప్రశ్నలను కలెక్టర్ స్వయంగా శిక్షణ పొందిన అధికారులకు అడిగి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, సిపిఓ గోవిందరాజులు, డిఆర్డీఓ కౌసల్యాదేవి, ఆర్డీవో లు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి జిల్లా, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రీడలకు మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక



పెబ్బేరు, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): వనపర్తి ఎస్జిఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ, కోకో క్రీడ పోటీలలో పెబ్బేరు మండలం తరపున జిల్లాస్థాయిలో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు అండర్ 17 కబడ్డీ విభాగంలో శ్రీకాంత్, శ్రావణి అండర్ 17 కోకో విభాగంలో శివ ఎంపికయ్యారు. వీరిని పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపల్ నరేష్, వైస్ ప్రిన్సిపాల్ చిన్న గోపాల్, ఫిసికల్ డైరెక్టర్ కమలాకర్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు అభినందించారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



### మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

దేవరకద్ర, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): మృతుని కుటుంబానికి అండగా ఉంటామని గ్రామస్తులు కోరారు.వనపర్తి జిల్లా మదనాపురం మండలం కొన్నూర్ పెద్ద తండా కు చెందిన వెంకటేష్ నాయక్ అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు గ్రామ ప్రజలందరూ కలిసి వారికి తోచిన విధంగా ప్రతి ఒక్కరు ఆర్థిక సాయం చేశారు. గ్రామ ప్రజలు చేసిన ఆర్థిక సాయం మొత్తం రూ.22,500 వేల రూపాయలు మృతుని కుటుంబానికి గ్రామ ప్రజల ఆధ్వర్యంలోఅందజేశారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి గ్రామ ప్రజలు అందరు కలిసి ధైర్యం చెప్పారు.

# మల్కి మియాన్ పల్లిలో గ్రామసభ

### పార్క్ తీసి, జీపీ భవనం నిర్మించాలి

### గ్రామస్తులు, తాండ వాసులు



వనపర్తి జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): ఘనపూర్ మండలం, మల్కి మియాన్ పల్లి గ్రామ పంచాయతీ లో, బుధవారం రోజు గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ముక్యంగా గ్రామ పంచాయితి భవనం కొరకు ఈ రోజు గ్రామసభను ఏర్పాటు చెయ్యడం జరిగింది. బి అర్ ఎస్ ప్రభుత్వ హయాంలో, రాజకీయ కక్ష తోని, గుడికి, మరియు, ఇంటి ముందర పార్క్ ఏర్పాటు చెయ్యడం వల్ల, అక్కడ ఉన్నటువంటి కుటుంబాలకు చాలా సమస్యలు ఏర్పడి ఉన్నాయని, అక్కడ ఉన్నటు వంటి పార్కుల నుండి పాములు, తేల్లు, అనేక రకాల అయినట్టువంటి విష పూరిత సర్పాలు, చుట్టూ పక్కన నివసించే నివాస గృహాలకు, మరియు గుడి లోకి విచేయ్యడం వల్ల, అక్కడున్న ప్రజలు భయభ్రాంతులకు గురై, గ్రామ పంచాయతీ సెక్రటరీ గారి ద్రుష్టి కి కుడా ఇట్టి విషయన్ని తీసికెళ్లడం జరిగిందది అని గ్రామప్రజలు తెలిపారు. కాబట్టి అక్కడి నుండి పార్క్ ను తరలించి, అ పార్క్ స్థలం లో గ్రామ పంచాయితి భవనం నిర్మించినట్లయితే, భవిష్యత్తులో గుడి దగ్గర కాళీ స్థలం ఏర్పడడం వల్ల, ఆ కాళీస్థలంలో గుడికి సంబంచిన పండుగలు గ్రామస్తు లు జరుపుకునేందుకు అనుకూలంగా ఉంటుందని గ్రామ సభలో నేడు (బుధవారం) గ్రామస్థుడైనా ఎం.రవి నాయక్ మాట్లాడడం జరిగిం ది. ఇట్టి విషయం పై, మల్కి మియాన్ పల్లి గ్రామస్తులు, మరియు తాండ వాసులు నాతో పాటు ఏఖీభవించడం జరిగిందని ఎం.రవి నాయక్ అన్నారు.వాస్తవంగా అక్కడ ఉన్నటువంటి పార్క్ ను తీసి, అక్కడే గ్రామ పంచాయతీ భవనం నిర్మించాలనిమెజారిటీ సభ్యులు కోరడం జరిగింది. బి అర్ ఎస్ నాయకుడు మాజీ సర్పంచ్ భర్త సాయ లు గారు మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితి లో నైనా సరే, ఇక్కడి నుండి పార్క్ తియ్యొద్దు, కాళీ స్థలం చూపెడుతామని చెప్పడం జరిగిం దని, దీనికి ఎం.రవి నాయక్ స్పందిస్తూ,మి ప్రభుత్వ హయాంలో పార్క్ ను,మరియు స్మశాన వాటికను, దూరంగా ఏర్పాటు చేసినట్లయితే, ఈ రోజు గ్రామంలో ఈ దుస్థితి ఉండేది కాదని బదులు ఇవ్వడం జరిగింది. కాబట్టి గ్రామస్తులు, తాండ వాసులు కోరిన విదంగా, అక్కడ ఉన్నటు వంటి పార్క్ ను మార్చి, అదే స్థలం లో గ్రామ పంచాయతీ భవనం నిర్మించాలని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కోరుకోవడం జరిగింది. కావున అదే స్థలంలో గ్రామ పంచాయతీ భవనం నిర్మించాలని కోరుకుంటున్నాం అని మల్కి మియాన్ పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు, తాండ ప్రజలు కోరడమైనది.

## జాతి నిర్మాతలు ఉపాధ్యాయులే



### – ఉత్తమ ఉపాధ్యాయులను సమాజం గుర్తుంచుకుంటుంది

### – గెజిటెడ్ హెడ్ మాస్టర్ పలుస శంకర్ గౌడ్

వనపర్తి జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): జాతి నిర్మాతలు ఉపాధ్యాయులే అని, ఉపాధ్యాయుల ఉత్తమ సేవలను సమాజం గుర్తుంచుకుంటుందని గెజిటెడ్ హెడ్ మాస్టర్ పలుస శంకర్ గౌడ్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాపర్లలో స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున ఎండీ. మోహినిద్దీన్ రిటైర్మెంట్ ఫంక్షన్లో వారు మాట్లాడుతు విద్యారంగానికి 26 సంవత్సరాలు మోహినిద్దీన్ అమోఘమైన సేవలు అందించారు. వారు ఎక్కడ పనిచేసినా ఆ స్కూల్ ను మోడల్ స్కూల్ గా తీర్చిదిద్దారు అన్నారు. ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. మొహినిద్దీన్ సేవలు ఉపాధ్యాయ సంఘ నాయకులు,బంధువులు, స్నేహితులు, పూర్వ విద్యార్థులు, వారి సేవలు కొనియాడారు. ఈ ప్రోగ్రాం లో కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ నర్సింగరావు, ఉపాధ్యాయ నాయకులు చంద్రశేఖర్, గణేష్ కుమార్, బౌద్దా రెడ్డి, డి.కృష్ణయ్య, సూర చంద్రశేఖర్, శ్రీనివాసరావు, హరిప్రసాద్, విష్ణు వర్ధన్, మురళీ కృష్ణ, నరేందర్ రెడ్డి, తిప్పాయపల్లి శ్రీనివాస్ రెడ్డి, పెబ్బైర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, బాబు రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జయమ్మ, తధితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అవకతవకలపై సమగ్ర నివేదిక ఇవ్వండి



### కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు

ఆత్మకూర్, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మున్సిపాలిటీలో జరిగినటువంటి అవకతవకలపై సమగ్ర నివేదిక తీసుకొని 10శాతం ల్యాండ్ సంబంధించి మరియు శిఖం ల్యాండ్కు దేవాదాయ భూములకు సంబంధించి సివిల్ సప్లై భూములకు సంబంధించి చెరువులకు సంబంధించి వాటి విషయాలపై మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి సూచన మేరకు తెలంగాణ రాష్ట్ర కల్లుగీత సెల్ డిపార్ట్మెంట్ చైర్మన్ కేశవ్ నాగరాజుగౌడ్ బుధవారం రోజు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో గతంలో అధికారుల నిర్లక్ష్యం పట్ల జరిగేటువంటి అవినీతి గురించి చర్చించారు. తక్షణమే జిల్లా కలెక్టర్ వీటిపై సమగ్ర విచారణకు జరిపి ప్రభుత్వ భూములను ఆ్రశమం కాపాడాలని అధికారులకు ఆయన ఆదేశించారు. ఇట్టి కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మొగిలి గంగాధర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి అయుబ్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు మణి వర్ధన్ రెడ్డి, చికెన్ వెంకటన్న, కాజా పాషా, పట్టణ యూత్ అధ్యక్షులు సంగేపాగ వంశీ, యూత్ మైనార్టీ అధ్యక్షులు ఎండి రఫిక్, నాగేశ్వర్, పరమేష్, రమేష్ యాదవ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం

### – లక్ష్యానికి మించి బిజెపి సభ్యత్వ నమోదు చేయాలి

### – ఇచ్చిన హామీలను తుంగలో తొక్కేసిన కాంగ్రెస్

### – ఆత్మకూర్ అక్రమ నిర్మాణాలపై చర్యలేవి

### – బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి



ఆత్మకూర్, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం దేవరపల్లి గుంటిపల్లి మోట్లంపల్లి అలాగే ఆత్మకూర్ మున్సిపల్ పరిధిలోని మూడో వార్డులో జోరుగా బిజెపి ఇంటింటి సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి నేరుగా కార్యకర్తలచే బిజెపి సభ్యత్వ నమోదు చేయించారు. అనంతరం లక్ష్యానికి మించి బీజేపీ సభ్యత్వాలు నమోదు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఇంటింటికి గడపగడపకు చేరే వేసే విధంగా కార్యకర్తలు చేయాలని ప్రతి ఒక్క బూత్ అధ్యక్షులు 200 సభ్యత్వాలు చేయించాలని సూచించారు స్థానిక సంస్థలు ఎన్నికలు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ఆయన అన్నారు. అనంతరం ఆత్మకూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు,ఇట్టి సమావేశ కార్యక్రమానికి మక్తల్ నియోజకవర్గం బిజెపి సభ్యత్వ ఇంచార్జ్ ప్రవాసి అందే బాబయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 29 లక్షల సభ్యత్వాలు నమోదు అయ్యాయని అన్నారు బిజెపి సభ్యత్వ నమోదు పై కార్యకర్తలకు పలు సూచన సలహాలు తెలియజేశారు. అనంతరం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ప్రజలను తుంగలోకి తొక్కేసి ప్రజలను మోసం చేస్తుందని ఆయన ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శించారు. అదేవిధంగా మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ఎన్నికలు వచ్చిన మాట ప్రకారం ఆత్మకూర్ రెవెన్యూ డివిజన్ ఏమైందని సూటిగా ప్రశ్నించారు. ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఎన్నో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ నాయకులు పలుమార్లు అధికారులకు విన్నపాలు ఇచ్చి అక్రమ దారులను విచారించి అక్రమనకు గురైన కట్టడాలను భూములను స్వాధీన పరుచుకోవాలని ఆయన అన్నారు. కానీ ఇప్పటివరకు అట్టి అక్రమాలకు గురైన కట్టడాలను గాని భూములను పైన గాని ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచిత్రమని పైగా కాంగ్రెస్ నాయకులు బ్లాక్ మెయిల్ రాజకీయాలను చేస్తున్నారని విమర్శించారు ఎందుకంటే ఆత్మకూరులో ఎన్నో అక్రమాలు జరిగాయి అంటూ అక్రమ దారులపై ఫిర్యాదులు చేసి వారితో డబ్బులు వసూలు చేస్తున్నారని వారు అన్నారు. ఇట్టి కార్యక్రమంలో షాద్నగర్ ఇన్చార్జ్ అందే బాబయ్య,సభ్యత్వ కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి ఆత్మకూరు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విన్ కుమార్ తమ్మలి విజయ్ బోరెల్లి రాము అశోక్ నంద బాలకృష్ణ వెంకట్ రాములు,ఎల్లన్న, చందు, అంజి, సురేష్, తమ్మలి వెంకటేష్, అనిల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి




### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య దీపావళి పండుగను జరుపుకోవాలని ఈ పండగ ప్రజల జీవితాల్లో మంచిని తీసుకురావడంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకాంక్షించారు. గురువారం దీపావళి పండగను పురస్కరించుకొని జిల్లా లోని ప్రజలకు కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండగ అంటే దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా పండగను జరుపుతామని అలాగే దీపావళి రోజున లక్ష్మీ, సరస్వతీ పూజలు చేసి ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాలతో ఉంటారన్నారు. బాణసంచా విషయంలో పిల్లల పట్ల పెద్దలు అప్రమత్తంగా ఉండాలన్నారు, ప్రజలు తమ తమ రంగాలలో మరింత ఉత్సాహంతో విజయాలు సాధించాలని, జిల్లా అభివృద్ధి కి తోడ్పడాలని కలెక్టర్ అన్నారు.

# ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

### – మండల ప్రజలకు ఎస్సై సురేష్ సూచనలు



అమరచింత, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): దీపావళి పండుగలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా కుటుంబ సభ్యులతో సంతోషంగా ప్రశాంతమైన వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని అమరచింత సబ్ ఇన్స్పెక్టర్ బి.సురేష్ మండల ప్రజలను కోరారు.దీపావళి సందర్భంగా పిల్లలు పెద్దలు తేడా లేకుండా టపాసులు కాల్చే సమయంలో మహిళలు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పిల్లలపై నిఘా ఉంచాలని ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉంటాయని లైసెన్స్ కలిగిన బాణాసంచా మాత్రమే వినియోగించాలని సరదా కోసం నిండు జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.ప్రతి ఒక్కరు తగ్గిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ముందుగా అమరచింత మున్సిపాలిటీ మరియు మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# మేడారానికి రైల్వే లైన్

వరంగల్: తెలంగాణలో రైల్వే ప్రగతి పనులు పరుగులు పెడుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రం అవసరాలకు తగినట్లుగా కేంద్రం రైళ్లను కేటాయిం చింది. కొత్త రైల్వే లైన్లు మంజూరు చేస్తోంది. అమృత్ పథకంలో అనేక రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తోంది. తెలంగాణలో రైల్వే అభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలోనే మణుగూరు రామగుండం రైల్వే లైన్ నిర్మాణాన్ని స్పీడప్ చేసింది. భూసేకరణ యుద్ధప్రాతిపదికన కొనసాగించేందుకు ముఖ్య అధికారులను నియమిస్తోంది. ఈమేరకు అక్టోబర్ 16న ప్రత్యేక నోటీసులు ఇచ్చింది.దీంతో అధికారులు రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై అధికారులు చర్యలు చేపట్టారు. భూపాలపల్లి ఆర్డీవో, కాటారం సబ్ కలెక్టర్, పెద్దపల్లి అదనపు కలెక్టర్ ఈ భూసేకరణ బాధ్యతలు చేపట్టారు. భూసేకరణ, పరిహారం చెల్లింపుపై కసరత్తు చేస్తున్నారు. మల్హర్రావు, కాటారం మండలాలు కాటారం సబ్ కలెక్టర్ చూస్తుండగా, ఘన్పూర్, భూపాలపల్లి మండలా లను భూపాలపల్లి ఆర్డీవో చూస్తున్నారు. ఇక మేడారం మీదుగా రైల్వేలైన్ పనులు ముత్తారం, మంథని, రామగిరి, కమాన్పూర్ పెద్దపల్లి ప్రాంతాల పనులను పెద్దపల్లి అదనపు కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. మణుగూరు నుంచి భూపాలపల్లి, కాటారం, మల్హర్రావుపేట, ఘన్పూర్, భూపాలపల్లి మండలాల మీదుగా రామగుండం వరకు 207.80 కిలోమీటర్ల మేర బ్రాడ్గేజ్ రైల్వేలైన్ పనులు చేపట్టనున్నారు.రామగుండం?మణుగూరు రైల్వేలైన్ నిర్మాణం పూర్తయితే బొగ్గు రవాణాకు కీలకంగా మారుతుంది.

# ఓఆర్ఆర్- ట్రిపుల్ఆర్‌కు మధ్య రేడియల్ రోడ్లు

**- 916 ఎకరాల భూమి అవసరం**
**- ఆర్అండ్‌బీ, హెచ్ఎండీఏ ప్రతిపాదన**
**- ఇప్పటికే ఆర్ఆర్ఆర్‌కు రైతుల నుంచి వ్యతిరేకత**
**- అయినా వెనుకడుగు వేయని సర్కారు**
**- రియల్ఎస్టేట్‌కు ఊపు తేవడానికేనా ?**



హైదరాబాద్: రెండు ప్రధాన రోడ్లను అనుసంధానం చేయాలంటే రెండు లైన్ల లేన్ రోడ్డు లేదా నాలుగు లేన్ల రోడ్డు సహజంగానే నిర్మించాల్సి ఉంటుంది. కాగా సర్కారు ఔటర్ రింగు రోడ్డు(ఓఆర్ఆర్), రీజనల్ రింగురోడ్డు(ఆర్ఆర్ఆర్)ను కలపడానికి ఏకంగా 300 అడుగుల రేడియల్ రోడ్డు నిర్మించాలని భావిస్తున్నది. ఇది దాదాపు ఔటర్ రింగు రోడ్డు అంత వెడెల్పు ఉంటుంది. అలాగే వ్యవసాయ పొలాల మధ్య నుంచి ఈ రోడ్డును ఏర్పాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ట్రాఫిక్‌తోపాటు ఇతర అవసరాల కోసం ఎలాంటి అధ్యయనం లేకుండానే ఈ భారీ రోడ్డును నిర్మించనుండటం గమనర్హాం. ఇది రియల్ ఎస్టేట్‌కు ఊపు తేవడానికా ? హైడ్రా చర్యల నేపథ్యంలో పడిపోతున్న సర్కారీ ఆదాయాన్ని పెంచుకోవడానికా అనే **సందేహాలు సర్వత్రా వ్యక్తమవు తున్నాయి.**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిపాదిత ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుపై ఇప్పటికే వ్యతిరేకత వ్యక్తమవుతున్న విషయం విదితమే. రెండు భాగాలుగా నిర్మించతలపెట్టిన ఈ రోడ్డుకు సంబంధించి ఉత్తరభాగం అలైన్‌మెంటు ఇప్పటికే ఖరారు కాగా, దీన్ని జాతీయ రహదారుల శాఖ(ఎన్‌హెచ్ఏఐ) ఆధ్వర్యంలో నిర్మించనున్నారు. సుమారు 1000 ఎకరాల భూములు దీనికోసం సేకరించాల్సి ఉండగా, రైతులు మాత్రం వ్యతిరేకిస్తున్నారు. కోర్టులో కేసులు కూడా దాఖలయ్యాయి. దీంతో టెండర్ల ప్రక్రియను సైతం చేపట్టలేని పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో ప్రభుత్వం ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నది. జాతీయ రహదారుల శాఖతో సంబంధం లేకుండా ప్రపంచ బ్యాంకు నిధులతో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఈ రోడ్డు నిర్మాణానికి దాదాపుగా నిర్ణయించినట్టు సమాచారం. ఓ వైపు దక్షిణ భాగం అలైన్‌మెంటు అష్టవంకరలు తిరుగుతూ ఇంకా తుదిరూపు రాని పరిస్థితుల్లో, మరోవైపు ఆర్ఆర్‌కు మధ్య తొమ్మిది గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్లు నిర్మించాలని ఆర్అండ్‌బీ, హెచ్ఎండీఏ నిర్ణయించి ప్రతిపాదించాయి. ఇందులో ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం-13 నుంచి ఏర్పాటు చేయనున్న రేడియల్ రోడ్డును ఏకంగా 300 అడుగుల వెడెల్పుతో నిర్మించాలని నిర్ణయించడం సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది.

**ల్యాండ్ పూలింగ్ తరహాలో భూసేకరణ**

రెండు దశల్లో అభివద్ధి చేయనున్న ఈ రేడియల్ రోడ్డు ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ మీదుగా స్కిల్ యూనివర్శిటీ వరకు సాగనుంది. ఈ మేరకు హెచ్ఎండీఏ ప్రతిపాదించింది. 41.5 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెంబరు 13(రావిర్యాల)నుంచి రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్ మండలంలోని ఆకుతోటపల్లి వరకు నిర్మించనున్నారు. ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య ప్రతిపాదిత తొమ్మిది గ్రీన్‌ఫీల్డ్ రోడ్లలో ఇదీ ఒకటి. మొదటి దశలో కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట్ వరకు 18 కిలోమీటర్లమేర దీన్ని నిర్మించ నుండగా, మిగిలింది రెండో దశలో పూర్తిచేస్తారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం ఆరు మండలాల్లోని 15 గ్రామాల పరిధిలో 916 ఎకరాల భూములు సేకరించాల్సిన అవసరం ఏర్పడుతుందని గుర్తించారు. మహేశ్వరం మండలంలోని కొంగ రఖుర్ద్, కందుకూరు మండల ంలోని లేమూర్, తిమ్మాపూర్, రాచులూర్, గుమ్మడవెల్లె, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్, కడ్తాల్ మండలంలోని కడ్తాల్, ముద్విన్, ఆమన్‌గల్ మండ లంలోని ఆమన్‌గల్, ఆకుతో టపల్లె, యాచారం మండలం లోని కుర్మిద్ద, ఇబ్రహీంపట్నం మండలంలోని ఫిరోజ్‌గూడ, కొంగ రకలాన్ తదితర గ్రామాల పరిధిలో మొత్తం 916 ఎకరాల భూములు సేకరించాలని ప్రణాళికలు రూపొందించగా, ఇందులో 568 ఎకరాలు ప్రయివేటు భూములుగా గుర్తించారు. మిగిలిన భూముల్లో 156 ఎకరాలు టీజీఐఐసీ, 169ఎకరాలు రిజర్వు ఫారెస్టు, 23 ఎకరాలు ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఉన్నాయి. హెచ్ఎండీఏ ఆధ్వర్యం లో స్పెషల్ టౌన్‌ప్లానింగ్ స్కీమ్ కింద ల్యాండ్ పూలింగ్ పద్ధతిలో భూములు సేకరిం చాలని ప్రతిపాదిం చారు. ఇందులో 60శాతం భూ యజమా నులకు, 40 శాతం హెచ్ఎండీఏకు భాగం ఉండేలా ప్రతిపాదించారు.

# సునీతా విలియమ్స్ దీవాళి విషెస్

న్యూఢిల్లీ: ప్రపంచమంతా దీపావళి వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పలు దేశాల్లో దీపావళిని ఘనంగా సెలబ్రేట్ చేసుకుంటారు. భారత్ లో అయితే దీపావళి వేడుకల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి దీపావళి శుభాకాంక్షలు చెప్పారు.దాదాపు ఏడాదిన్నర క్రితం అంతరిక్షంలోకి వెళ్లిన సునీతా విలియమ్స్ సహా సానా బృందం బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌక మానవ ప్రయాణానికి తగిన స్థితిలో లేదని ప్రకటించారు. దాంతో వ్యోమగాములు స్పేస్ స్టేషన్ లోనే ఉంటున్నారు. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో తాజాగా దీపావళి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ నుంచి సునీతా విలియమ్స్ పంపిన దీపావళి శుభాకాంక్షలు వీడియోను వైట్ హౌస్ ప్రదర్శించింది. ఐఎస్ఎస్ నుంచి మీకు దీపావళి శుభాకాంక్షలు అని చెప్పిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో, ప్రపంచ వ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకుంటున్న ప్రతి ఒక్కరికీ దీపావళి శుభాకాంక్షలు అని సునీత విలియమ్స్ పండుగ విషెస్ తెలిపారు. వైట్‌హౌస్‌లో దీపావళి వేడుకల్లో పాల్గొన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, డెమోక్రాట్స్ అధ్యక్ష అభ్యర్థి, ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌లకు తనకు అవకాశం ఇచ్చినందుకు ఆస్ట్రోనాట్ సునీత విలియమ్స్ కృతజ్ఞతలు తెలిపారు."ఈ ఏడాది భూమికి 260 మైళ్ల ఎత్తులో ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌లో దీపావళి జరుపుకునే అరుదైన అవకాశం నాకు లభించింది. దీపావళి సహా ఇతర భారతీయ పండుగల గురించి మా నాన్న చిన్నప్పటి నుంచి మాకు బోధించారు. తద్వారా భారత సాంస్కృతిక మూలాలను మాలో ఉంటేలా చేశారు. దీపావళి అనేది మనకు సంతోషకరమైన సమయం. ప్రపంచంలో పలు దేశాల్లో దీపావళి సెలబ్రేట్ చేసుకుంటారు. కానీ ఈ ఏడాది గతానికి భిన్నంగా మా మా వ్యోమగాములతో కలిసి అంతరిక్షంలో పండుగ చేసుకుంటున్నాను. మాకు ఈ అవకాశం కల్పించిన అధ్యక్షుడు బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ లకు ధన్యవాదాలు" అని సునీతా విలియమ్స్ వీడియో సందేశంలో తెలిపారు.

# గ్రూప్ వన్ పరీక్షలకు 67 శాతమే హాజరు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు ముగిసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో మొత్తం 46 పరీక్ష కేంద్రాల్లో అక్టోబర్ 21వ తేదీ నుంచి అక్టోబర్ 27వ తేదీ వరకు గ్రూప్ 1 పరీక్షలు జరిగాయి. మొత్తం 7 పేపర్లకు ఈ పరీక్షలు జరిగాయి. అయితే ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయిన 31,383 మందీ పరీక్షలకు హాజరుకాలేదు. వీరిలో కేవలం 67.17శాతం మాత్రమే గ్రూప్ 1 మెయిన్స్‌కు హాజరయ్యారు. అంటే 21,181 మంది మాత్రమే పరీక్ష రాశారు. ఈ మేరకు హాజరు శాతాన్ని టీజీపీఎస్సీ తాజాగా ప్రకటించింది. ఏడు పేపర్లకు (జనరల్ ఇంగ్లిష్ కలిపి) 21,093 మంది అభ్యర్థులు హాజరయ్యారని వెల్లడించింది. అక్టోబరు 21 నుంచి నిర్వహించిన పరీక్షలు అక్టోబరు 27తో ముగిశాయి.మొత్తం 563 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ గ్రూప్ 1 నియామక ప్రక్రియ కొనసాగుతుంది. తాజాగా నిర్వహించిన గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలకు క్వాలిఫై అయిన మొత్తం 31,383 మందిలో హైకోర్టు అనుమతితో పరీక్షలకు హాజరైన 20 మంది స్పోర్ట్స్ అభ్యర్థులు కూడా ఉన్నారు. వీరందరికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని46 పరీక్ష కేంద్రాల్లో మెయిన్స్ పరీక్షలు జరిగాయి. అన్ని పేపర్లకు హాజరైన అభ్యర్థుల వివరాలను కేటగిరీల వారీగా టీజీపీఎస్సీ తాజాగా ప్రకటిం చింది.క్రీడల కేటగిరీలోని అభ్యర్థులు మినహా అన్ని రిజర్వుడు విభాగాల్లోని అభ్యర్థులు ఓపెన్ కేటగిరీలోని పోస్టులకు మెయిన్స్ మెరిట్ ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తామని కార్యదర్శి నవీన్ నికోలస్ వెల్లడించారు. ఈ మెయిన్స్ పరీక్షల్లో మల్టీజోన్ 1, 2లలోని 5 శాతం అన్‌రిజర్వుడు పోస్టులకు మొత్తం 2550 మంది పరీక్షలు రాశారు.వీరిలో తెలంగాణ స్థానికత లేని అభ్యర్థులు 182 మంది వరకు ఉన్నట్లు కమిషన్ వెల్లడించింది. దివ్యాంగుల కేటగిరీలో 1:50 నిష్పత్తి ప్రకారం 1229 మంది అభ్యర్థులు మెయిన్స్ అర్హత సాధించినట్లు తెలిపారు. పరీక్షకు హాజరైన వారి విషయానికొస్తే ఈ గణాంకాల్లో స్వల్పమార్పులు ఉండే అవకాశముందని టీజీపీఎస్సీ పేర్కొంది.మెయిన్స్ వాయిదా వేయా లంటూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్ 1 అభ్యర్థులు ఆందోళనలు చేపట్టినా.. వాటిని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకో కుండా రేవంత్ సర్కార్ షెడ్యూల్ ప్రకారం గానే పరీక్షలు నిర్వహించింది. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ పలువురు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలకు దూరంగా ఉన్నట్లు సమాచారం.

# మట్టి రోడ్డు లేకుండా చేస్తున్నాం

నల్గొండ: రాష్ట్రంలో ఎక్కడ మట్టిరోడ్డు అన్నదే లేకుండా ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రహదారులు నిర్మిస్తామని రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఆయన నల్గొండ జిల్లా కనగల్ మండలం పగిడిమర్రి గ్రామం సమీపం లోని సోమన్న వాగు వద్ద 38 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మూడు డబుల్ రోడ్లు, హై లెవెల్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రహదారుల అభివృద్ధిలో భాగంగా, 30 వేల కోట్ల రూపాయల వ్యయంతో రీజినల్ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రత్యేకించి నల్గొండ జిల్లాలో ఆర్ అండ్ బి రహదారులకు 600 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని ,శ్రీశైలం- దేవరకొండ రహదారి అటవీ ప్రాంతంలో ఉన్నప్పటికీ అభివృద్ధి చేస్తున్నామని ,కనగల్ జంక్షన్ ను 8 కోట్ల రూపాయలతో వెడల్పు చేయడం జరుగుతున్నదని, అంతేకాక అక్కడ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ధర్వేశిపురం రోడ్డు వెడల్పు చేసి నాలుగు నెలల్లో పనులు పూర్తి చేయనున్నామని, అలాగే తిప్పర్తి జంక్షన్ ను 9 కోట్ల రూపాయలతో వెడల్పు చేసే పనులు ప్రారంభించడం జరిగిందని, ఇటీవలే మిర్యాల గూడలో 147 కోట్ల రూపాయలతో ఆర్ అండ్ బి రహదారి పనులు ప్రారంభించడం జరిగిందని మంత్రి వెల్లడించారు. 38 కోట్ల రూపాయ లతో చేపట్టిన కొత్తపల్లి- పగిడిమర్రి, పగిడిమర్రి- మదనపురం ,పగిడిమర్రి- కుదవన్ పూర్ రోడ్లతోపాటు, పగిడిమర్రి అంతారం డబుల్ రోడ్డు పనులు బుధవారం నుండి ప్రారంభం చేసి పది నెలల్లో బ్రిడ్జితో సహా పూర్తి చేస్తామని చెప్పారు.పగిడిమర్రి రోడ్డుతో పాటు, చెక్ డ్యామ్ సైతం నిర్మిస్తున్నామని, దీనివల్ల భూగర్భ జలాలు పెరిగి రైతులకు మేలు కలుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ మట్టి రోడ్డు లేకుండా గ్రామాల నుండి మండల కేంద్రానికి,మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రానికి సుమారు 12 వేల కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికిరాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు మంత్రి తెలిపారు.

# చేప పిల్లలు నీటిలో వదిలే కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి జిల్లా, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): మిరాసిపల్లి గ్రామంలో చేప పిల్లలు వదిలే కార్యక్రమం లో దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశాల మేరకు కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. మిరాసిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మత్స్యకారులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా ముదిరాజుల జీవితాల్లో వెలుగులు నింపాలనీ, సీఎం రేవంత్ రెడ్డి ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ముదిరాజుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చెయ్యడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని, అంతేకాకుండా కులవృత్తుల వారు ఆర్థికంగా ఎదిగేందుకు గ్రామాలలో ముదిరాజుల భవిష్యత్తు కోసం వారి లాభాల కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మిరాసిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ సర్పంచ్ సాయి రెడ్డి గారు కిరణ్ కుమార్ రెడ్డి మదనపురం మార్కెట్ యార్డు చెర్మన్ పల్లె పాగా ప్రశాంత్, సీడిసి చెర్మన్ పాపయ్య చంద్రశేఖర్ రెడ్డి గోల్ల బాబు రెడ్డి కోత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగవరపు బిచ్చుపల్లి యాదవ్ మిరాసిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉప అధ్యక్షులు పసుపుల భీముడు, శేఖర్ రెడ్డి, తెలుగు మన్నెం, తెలుగు ఆనంద్, కర్ణకర్ తెలుగు సురేష్, తెలుగు రాములు ఈ చేపల కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. అనంతరం దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డికి ముదిరాజ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలపడం జరిగింది. జి.ఎం.ఆర్ అన్న సోషల్ మీడియా శంకర మౌని అశోక్ ముదిరాజ్ తెలిపారు.




# ప్రజల జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలి

**- మీసాల ఉపేందర్**



పాలకవీడు, అక్టోబర్ 30 (తీన్మార్ న్యూస్): ఈ దీపావళి సమస్త ప్రజలకు వారి వారి వృత్తి వ్యాపారాలలో సంపూర్ణ విజయాలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని మాజీ ఎంపీటీసీల ఫోరమ్ జిల్లా కార్యదర్శి మీసాల ఉపేందర్ఆకాంక్షించారు. ప్రజలకు, నాయకులకు, అధికారులకు, కార్మికులకు, కర్శకులకు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు, విద్యార్థిని విద్యార్థులకు వారుదీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సత్యభామ నరకాసురున్ని వధించి నరులందరి జీవితాల్లో వెలుగులు నింపిన మాత శౌర్యానికి, చెడుపై మంచి సాధించిన విజయాలకు గుర్తుగా ధర్మ స్థాపనకు నిదర్శనంగా, విజయాలను అందించే దీపావళి పండుగను దేశవ్యాప్తంగా జరుపుకుంటారని అన్నారు. ప్రజలలో స్వార్థం, అన్యాయం, అసమానత్వం, అరాచకం, అజ్ఞాన చీకట్లను పారద్రోలి నిస్వార్థ, మానవత్వం, స్నేహ సౌభ్రాతృత్వం, విజ్ఞానపు వెలుగులను ప్రసరించడానికి దీపాల వరుసతో వెలిగించి దీపావళిజరుపుకుంటారని, దీపం వెలిగించడం జ్ఞాన ప్రచోదనకు సంకేతం అని, దీపం వెలిగించడం ద్వారా త్రి జగన్మాతలైన మహాకాళీ, మహాలక్ష్మి,మహాసరస్వతిల శక్తి త్రయాన్ని పూజిస్తారని, నరక చతుర్దశి తరువాత లక్ష్మి పూజ నిర్వహించి లక్ష్మి కటాక్షం పొందుతారని దీపకాంతి స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలందరూ ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు వైరస్ ల బారిన పడకుండా సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలు తో వర్ధిల్లాలని దీపావళి సందర్భంగా ఆయన అమ్మవారిని కోరారు.ప్రజలందరు దీపాలు వెలిగించేప్పుడు, టపాకాయలు కాల్చేటప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని చిన్న పిల్లలు పెద్దల సమక్షంలోనే టపాకాయలు కాల్చేలా చూడాలని కోరారు.

# వ్యర్థాలతో ఆహారాలు డేంజర్..,.డేంజర్

హైదరాబాద్: ఒకప్పుడు ఇంట్లో వేడుకలు సమయంలోనే మాంసాహారం తినేవారు. కానీ ఇప్పుడు అరుదుగానే శాఖాహారం తింటున్నారు. చికెన్, మటన్, ఫిష్, ప్రాన్స్, క్రాబ్స్.. ఇలా మాంసాన్ని లొట్టలు వేసుకుంటూ తింటున్నారు.ఫలితంగా ముక్కలేనిది ముద్ద దిగని పరిస్థితికి వచ్చారు. పైగా కొత్త కొత్త హోటళ్లు, రకరకాల మెనూలు అందుబాటులోకి రావడంతో చాలామంది బయటనే తినేస్తున్నారు. ఇక స్మార్ట్ ఫోన్ లో రకరకాల ఫుడ్ డెలివరీ యాప్స్ లో ఆర్డర్ చేస్తే సరాసరి ఫుడ్ ఇంటికి వస్తోంది. అయితే ఇందులో వెజ్ కంటే నాన్ వెజ్ ఆర్డర్సే ఎక్కువగా ఉంటున్నాయి. ఇక ఇటీవల కాలంలో మాంసాన్ని అమ్మే స్టార్టప్స్ అందుబాటులోకి రావడంతో.. వాటి విక్రయాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇప్పటివరకు మెట్రో నగరాలకు మాత్రమే పరిమితమైన ఈ స్టార్టప్ సంస్థలు.. ఇకపై టైర్-1, టైర్ -2, టైర్ -3 సిటీలకు కూడా విస్తరించనున్నాయి. మాంసం విక్రయాలు అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంటున్నది. ముఖ్యంగా హైదరాబాదు లాంటి నగరంలో ఆదివారం వచ్చిందంటే చాలు ఇతర ప్రాంతాల నుంచి చికెన్, గొర్రెలు, చేపలు, రొయ్యలు దిగుమతి చేసుకుంటున్నారు. అయితే ప్రజల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది కొంతమంది అక్రమార్గాలు పడుతున్నారు. దీంతో జనం రోగాల బారిన పడుతున్నారు.హైదరాబాదులో కోడి మాంసం దుకాణాలు లక్షలాదిగా ఉంటాయి. వీటిల్లో రోజు లక్షల క్వింటాలలో విక్రయాలు జరుగుతుంటాయి. అయితే మాంసం విక్రయించే దుకాణాలలో కోళ్లకు సంబంధించిన వ్యర్ధాలను బయటపడేస్తుంటారు. అయితే వాటిని కొంతమంది సేకరించి కోడి మాంసం పేరుతో విక్రయిస్తున్నారు. పాతబస్తీ కేంద్రంగా కుళ్ళిన కోడి మాంసాన్ని అక్రమార్కులు అమ్ముతున్నారు. ఇలా అమ్ముతున్న రెండు ముఠాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. ఆ ముఠాలు కూలిన కోడి మాంసాన్ని ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాయని అధికారుల పరిశీలనలో తేలింది. అంతేకాదు ఆ ముఠాలు ఏకంగా కూలిన కోడి మాంసాన్ని నిల్వ చేయడానికి ఏకంగా గిడ్డంగులు నిర్మించాయి. వాటి ద్వారా నగరంలోని రెస్టారెంట్లు, బార్లు, పబ్ లు, హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు విక్రయిస్తున్నారు.కొంతమంది కోడి మాంసాన్ని స్కిన్ తో తింటారు. కొంతమంది స్కిన్ లేకుండా తింటారు. ఇక ఉదర భాగం ముక్కలు, రెక్కలు, తొడ మాంసాన్ని ప్రత్యేకంగా కొనుగోలు చేస్తారు.. ఇక ఆన్లైన్ సంస్థలు కూడా మేక, గొర్రెపోతు, కోడి మాంసాన్ని విక్రయిస్తున్నాయి.. అయితే వీటి పరిధిలో మాంసాన్ని శుద్ధి చేసే సమయంలో వ్యర్థాలు భారీగా పోగవుతున్నాయి. ఆ వ్యర్థాలను ఈ ముఠా సభ్యులు సేకరించి.. గోదాములలో భద్రపరిచి విక్రయిస్తున్నారు. చిన్న చిన్న సంచుల్లో ప్యాక్ చేసి అమ్ముతున్నారు.. బేగంపేటలోని ఓ ప్రాంతంలో స్థానికంగా ఉన్న కార్పొరేటర్ కు చెందిన గోదాం నుంచి బయటికి సరఫరా అవుతున్న కోడి మాంసం పై అనేక ఆరోపణలు ఉన్నాయి. గోదాం పై అధికారులు తనిఖీలు చేయగా.. విస్మయకర వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఆ మాంసం మొత్తం పూర్తిగా వ్యర్థాలతో రూపొందించిందని.. పైగా అది రోజుల తరబడి నిల్వ ఉన్నదని.. హై ఎండ్ ఫ్రీజర్వేటర్లు వాడి ఆ మాంసాన్ని ప్యాక్ చేస్తున్నారని అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో అధికారులు వెంటనే ఆ కేంద్రాన్ని మూసివేశారు. ఇక బేగంపేట ప్రకాష్ నగర్ లోనూ ఇటువంటి సంఘటన వెలుగులోకి వచ్చింది. ఒక గోదాం పై అధికారులు దాడులు చేసి దాదాపు 700 కిలోల కుళ్లిపోయిన కోడి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. కంటోన్మెంట్ లోనూ ఇలాంటి కేంద్రమే ఒకటి వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత దానిని అధికారులు మూసివేశారు.

# 3 రోజులుగా మృతదేహాలతోనే తల్లిదండ్రులు

హైదరాబాద్: హైదరాబాద్‌లో జరిగిన ఓ ఘటన కన్నీళ్లు పెట్టిస్తోంది. కుమారుడు చనిపోయి మూడు రోజులు అవుతున్నా దివ్యాంగులైన కన్నవాళ్లు గుర్తించలేకపోయారు. మృతదేహం చుట్టే తిరుగుతున్నారు తప్ప తెలుసుకోలేకపోయారు. వాసన వస్తుంటే ఏదో చనిపోయి ఉంటుందనుకున్నారు. కొడుకు వచ్చి అన్నం పెడతాడంటూ ఆశగా ఆకలితో ఎదురు చూశారు. నాగోల్‌లో జరిగిన ఈ ఘటన సంచలనంగా మారింది. ఇదే ప్రాంతంలో ఉంటున్న రమణ, శాంతకుమారి దివ్యాంగ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు వేరుగా ఉంటున్నాడు. చిన్న కుమారుడు కన్నవారితోనే ఉంటున్నాడు. రమణ ట్రైబల్ వెల్ఫేర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు వచ్చిన డబ్బులతో తాగుతూ జల్సాలు చేస్తూ తిరుగుతున్నాడు. ఈ కారణంగానే భార్య చాలా ఏళ్ల క్రితం విడిచిపెట్టి వెళ్లిపోయింది. చిన్న కుమారుడికి ఫిట్స్ కూడా ఉంది. తల్లిదండ్రులతో ఉంటున్న చిన్నకొడుకు... ఎప్పుడో వచ్చి తల్లిదండ్రులకు భోజనం పెట్టే వాడు. అయితే మూడు రోజుల క్రితం ఎప్పటి మాదిరిగానే ఫుల్‌గా తాగి వచ్చాడు చిన్న కొడుకు. అలా తాగి వచ్చిన టైంలోనే ఫిట్స్ వచ్చింది. దీంతో ఇంట్లోనే చనిపోయాడు. అయితే ఈ విషయాన్ని తెలుసుకోలేకపోయిన ఆ కన్నవాళ్లు... చిన్న కుమారుడి కోసం ఎంతగానో ఎదురు చూశారు. చిన్న కుమారుడు వస్తాడని ఆకలి తీరుస్తాడని ఎదురు చూస్తున్నారు. ఎప్పటికీ రాలేదు. అంతే కాకుండా ఇంట్లో దుర్వాసన కూడా వస్తుండటాన్ని గుర్తించారు. ఏదో జీవి చనిపోయి ఉంటుందని సర్ది చెప్పుకున్నారు. కొడుకు వస్తే అదేంటో తెలుసుకుంటాడని అనుకున్నారు. అంతే కానీ కుమారుడు చనిపోయి ఉన్నారనే విషయాన్ని గుర్తించలేకపోయారు. చుట్టుపక్కల వాళ్లకి కూడా దుర్వాసన రావడం ప్రారంభమైంది. కంటిన్యూగా వస్తున్న వాసన భరించలేక నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికుల ఫిర్యాదుతో సోమవారం ఆ ఇంటికి వచ్చిన నాగోల్ పోలీసులకు అసలు విషయం తెలిసింది. తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూస్తే షాక్ తిన్నారు. ఓవైపు కుళ్లిపోయిన మృతదేహం ఉంటే... అక్కడే ఏం తెలియకుండా కూర్చొని ఉన్న పేరెంట్స్‌ను చూసి కంగుతిన్నారు. పూర్తి వివరాలు తెలుసుకున్న పోలీసులు పెద్ద కుమారుడిని అక్కడకు పిలిచి తల్లిదండ్రులను అప్పగించారు. వారికి అప్పటికే భోజనం పెట్టారు. ఇతర సపర్యలు చేశారు. మూడు రోజుల నుంచి ఒక్కరు కూడా ఇంటి నుంచి బయటకు రాకపోవడం, ఎలాంటి మూమెంట్ లేకపోయనా స్థానికులు గమనించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

# బీఆర్ఎస్ ను వెంటాడుతున్న సంఘటనలు

హైదరాబాద్: రాజ్ పాకాల కేవలం ఫ్యామిలీ మెంబర్స్, ఆత్మీయులకే ఆ పార్టీ ఇచ్చాడని చెప్పాడు. కానీ.. ప్రచారం మాత్రం అందుకు భిన్నంగా ఉంది. అయితే.. ఇంతటి వ్యతిరేక ప్రచారం రావడానికి కారణాలూ లేకపోలేదు. 'మనం ఏది చేస్తా.. మనకు అదే వస్తుంది' అన్నట్లుగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రాజకీయమే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నట్లుగా టాక్ వినిపిస్తోంది.తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఆదివారం సంచలనాలు నమోదయ్యాయి. ఓ చిన్న పార్టీ చివరకు కేసీఆర్ ఫ్యామిలీని రచ్చకీడ్చింది. కేసీఆర్ కుటుంబం వ్యవహారంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఓ ఫ్యామిలీ పార్టీ కాస్త ఈ వివాదానికి కారణమైంది. నిన్న కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాంహౌజ్‌లో జరిగిన పార్టీ చిలికిచిలికి గాలివానగా మారింది. చివరకు పోలీసులు రాజ్ పాకాలకు నోటీసులు ఇవ్వాల్సి వచ్చింది. అయితే.. అది ఫ్యామిలీ పార్టీ అయినప్పటికీ పెద్ద కేసుగానే ప్రచారం జరిగింది. కానీ.. కాస్త ఆలోచిస్తే ఇది అంత పెద్ద కేసు కాదని అర్థం చేసుకోవచ్చు. కేవలం ఫ్యామిలీ కోసమే రాజ్ పాకాల ఈ పార్టీని ఏర్పాటు చేశాడు. దీనిపై కేటీఆర్ కూడా క్లారిటీ ఇచ్చాడు. రాజ్ పాకాల కేవలం ఫ్యామిలీ మెంబర్స్, ఆత్మీయులకే ఆ పార్టీ ఇచ్చాడని చెప్పాడు. కానీ.. ప్రచారం మాత్రం అందుకు భిన్నంగా ఉంది. అయితే.. ఇంతటి వ్యతిరేక ప్రచారం రావడానికి కారణాలూ లేకపోలేదు. 'మనం ఏది చేస్తా.. మనకు అదే వస్తుంది' అన్నట్లుగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రాజకీయమే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నట్లుగా టాక్ వినిపిస్తోంది. రాజ్ పాకాల తన ఫాంహౌస్‌లో నిర్వహించింది చిన్నపాటి లిక్కర్ పార్టీనే అనేది తెలుస్తోంది. కాకుంటే అనుమతి లేకుండా నిర్వహించడాన్ని పోలీసులు తప్పుపట్టారు. ఈ క్రమంలో చిన్నపాటి కేసు నమోదయ్యే అవకాశాలు ఉండేవి. కానీ.. ఇప్పుడు ఫాంహౌస్ ఓనర్, పార్టీ నిర్వహించిన రాజ్ పాకాలనే కనిపించకుండా పోవడంతో సీరియస్‌గా మారిపోయింది. మరోవైపు.. పార్టీలో పాల్గొన్న వారికి చేసిన టెస్టుల్లోనూ ఒకరికి కొకైన్ పాజిటివ్‌గా తేలింది. తనకు రాజ్ పాకాలనే ఆ కొకైన్ ఇచ్చినట్లుగా సదరు వ్యక్తి చెప్పాడు. దీంతో ఈ వివాదం కాస్త డ్రగ్స్ వైపునకు దారితీసింది. ఆ కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా డ్రగ్స్ వాడినట్లుగా ప్రచారం ఉంది. అయితే ఈ పార్టీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం పాల్గొన్నట్లుగా నిన్నటి నుంచి ప్రచారం జరుగుతోంది. పోలీసులు వచ్చే కాసేపటికే ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారని పలువురు ఆరోపించడం కనిపించింది. పార్టీలో నుంచి వెళ్లిపోతున్నట్లు కేటీఆర్‌కు సంబంధించిన వీడియో క్లిప్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆయన పాల్గొన్నది లేనిది ఇప్పటివరకు కూడా ఎలాంటి క్లారిటీ లేదు.ఇదిలా ఉండగా.. రాజ్ పాకాల కనిపించకుండా పోవడంతో ఎక్సైజ్ పోలీసులు ఓరియన్ విల్లాస్లోని ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తాళాలు బద్దలు కొట్టారు. సోదాలకు ప్రయత్నించారు. ఆ తర్వాత నందినగర్‌లోని కేటీఆర్ ఇంటి వద్ద కూడా పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. దాంతో ఈ మందు పార్టీ వ్యవహారం కాస్తా బీఆర్ఎస్‌లో ప్రకంపనలకు దారితీసింది. దీనిని ఎలా సమర్థించుకోవాలో కూడా తెలియక గులాబీ పార్టీ నేతలు సతమతం అవుతున్నారని తెలుస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలో ఒకవిధంగా ఉండేవి. కానీ.. తెలంగాణ రాష్ట్రం ఎప్పుడైతే ఏర్పడిందో.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడైతే కొలువుదీరిందో అప్పటి నుంచి రాజకీయాలు ఇంట్రస్టింగ్‌గా మారాయి. రాజకీయ ప్రత్యర్థుల్ని ట్రాప్ చేయడం లేదంటే బ్లాక్ మెయిల్ చేయడం వంటి రాజకీయాలు చాలా వరకు పెరిగిపోయాయి. అవి ఎంతలా అంటే బీఆర్ఎస్ హయాంలో కిందిస్థాయి నుంచి పెద్దల స్థాయి వరకూ ఈ కుట్రలు జరిగాయని అందరూ చెప్పే మాటే. కేసులు నిర్ధారణ కాకున్నా కొంత మందిని అరెస్టు చేసి రోజుల తరబడి జైళ్లో పెట్టిన దాఖలాలు ఉన్నాయి. వారిపై ఇష్టం వచ్చినట్లుగా కామెంట్స్ చేస్తూ? ప్రచారం చేశారు. అటు కాంగ్రెస్ నేతలు కానీ.. ఇటు బీజేపీ నేతలు కానీ.. అందరూ ఈ బాధలు అనుభవించారు.అయితే.. గతంలో ఆ బాధలు అనుభవించిన వారంతా ఇప్పుడు వివిధ పదవుల్లో ఉన్నారు. రాష్ట్రంలో ఓ నాయకుడి వాయిస్ కాస్త గట్టిగా వినిపిస్తున్నది అంటే.. అతడిని గత బీఆర్ఎస్ హయాంలో తొక్కిపెట్టే ప్రయత్నమే జరిగిందని చెప్పాల్సిందే. ప్రతీ నేత బీఆర్ఎస్ కుట్రలకు బలైన వారే. అలా.. ముందుగా ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డిని ట్రాప్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్లను సైతం ట్యాప్ చేశారు. ఆ తరువాత ఎమ్మెల్యేల ట్రాప్ అంటూ బీజేపీని ట్రాప్ చేశారు. బీజేపీ అగ్రనేతలను అరెస్టు చేసేందుకూ నానా హంగామా చేశారు. చివరకు ఆ కేసులో కూడా బీఆర్ఎస్ అభాసు పాలైంది. పక్క రాష్ట్రాల కోసం డేటా చోరీ అంటూ మరో గేమ్‌కు తెరలేపారు. పేపర్ లీకేజీ విషయంలో బండి సంజయ్ కుమార్‌ను అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో కీలక అరెస్టులు ఉన్నాయి. ఎన్నో కుట్రలూ ఉన్నాయి. పదేళ్ల కాలంపాటు అధికారంలో ఉన్నామని అడ్డగోలు రాజకీయాలు బీఆర్ఎస్ చేసింది. అవన్నీ ఇప్పుడు రాష్ట్రంలో మరోసారి చర్చకు వచ్చాయి. దాంతో ఇప్పుడు గులాబీ పార్టీకి కనీసం సానుభూతి దొరకని పరిస్థితి వచ్చింది. ఇప్పుడు రాజ్ పాకాల కేసు విషయంలోనూ ఎవరూ పెద్దగా వ్యతిరేకించడంలేదు. గతంలో చేసిన వాటికి ఈ మాత్రం ఎదుర్కోక తప్పదనే కామెంట్స్ వినిపిస్తుండడం బీఆర్ఎస్ పార్టీపై ఉన్న వ్యతిరేకతను తెలుపుతోంది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు డ్రగ్స్ టెస్టులు చేయాలి

**- రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్**

హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందరికీ డ్రగ్స్ టెస్ట్ లు చేయాలని రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్ పోలీసులకు విజ్ఞప్తి చేసారు. డ్రగ్స్ బయట పడిన ప్రతి సారి వాళ్ళు బయటికి వచ్చి మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సిగ్గు ఉంటే డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలి. రాజ్ పాకాల,విజయ్ మద్దూరిని వెనుకేసుకరావడానికి కేటీఆర్ కి సిగ్గు ఉండాలి. కేటీఆర్ కు అసలు బినామీ విజయ్ మద్దూరి . గతం ప్రభుత్వం డ్రగ్స్ కేసుని ఏ విధంగా దారి మళ్లించారో ప్రజలకు తెలుసు. జన్వాడ పామ్ హౌస్ అంటే నే కాంట్రవర్సీ. ఒక సారి దీపావళి పెస్టివల్,ఇంకో సారి గృహ ప్రవేశం అంటున్నారు. డ్రగ్స్ ని స్కూల్ పిల్లల వరకు తీసుకెళ్లిన ఘనత గత ప్రభుత్వానిది. కాంగ్రెస్ ప్రభుత్వం డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా చేస్తుంటే, వాళ్ళు డ్రగ్స్ ని ప్రేరేపించాలని చూస్తున్నారని అన్నారు. తెలంగాణ ను కేసీఆర్ కుటుంబం ఏమి చేయాలనుకుంటుంది. స్వయంగా డ్రగ్స్ వాడినట్లు పోలీసుల ముందు విజయ్ మద్దూరి ఒప్పుకుండు. రాజ్ పాకాల డ్రగ్స్ ఇచ్చినట్లు విజయ్ మద్దూరి ఒప్పుకుండు. ఇప్పుడు స్టేట్మెంట్ ను మారుస్తుండు. పామ్ హౌస్ దొర కేసిఆర్ డిజిపికి ఫోన్ చేసి ఇబ్బంది పెడుతుండు. ఆయనకు పర్సనల్ ఇంట్రెస్ట్ ఏముంది. కేసీఆర్ ఎక్కడ ఉండు అని ప్రజలు అడుగుతున్నారని అన్నారు

# ఆగమాగం.. నాగం...

మహబూబ్ నగర్: నాగం జనార్దన్ రెడ్డి తెలుగు రెండు రాష్ట్రాల్లో ఈ పేరు తెలియని వారు ఉండరు. నాగర్ కర్నూల్ నియోజకవర్గం అంటే నాగం.. నాగం అంటే నాగర్ కర్నూల్ అన్న రేంజ్లో రాజకీయాల్లో చక్రం తిప్పారాయన. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో తిరుగులేని నేతగా ఎదిగిన ఆయన తన రాజకీయ భవిష్యత్తును తానే నాశనం చేసుకున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. హితులు సన్నిహితులు చెప్పిన మాటలు పెడ చెవిన పెట్టి రాజకీయంగా ఆత్మహత్యకు పాల్పడ్డారని అటు రాజకీయవర్గాల్లోనూ, నాగర్‌కర్నూల్ వాసుల్లోనూ చర్చ జరుగుతుంది.అసెంబ్లీ టైగర్‌గా పేరు ఉన్న నాగం జనార్దన్ రెడ్డి సుదీర్ఘకాలం పాటు నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేగా , మంత్రిగా పనిచేశారు . పార్టీలో చంద్రబాబునాయుడు ఆయనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించారు. 2009లో గెలిచిన నాగం తెలంగాణ ఉద్యమ సమయంలో ఉస్మానియా క్యాంపస్ లో దాడి తర్వాత సెంటిమెంట్ పేరుతో టిడిపి అధినేతతో విభేదించి పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసారు. తన రాజీనామా ఆమోదం కోసం అసెంబ్లీలో బైఠాయించిన మొండిఘటం నాగం జనార్దన్ రెడ్డి.ఆ తర్వాత తెలంగాణా నగారా అని సొంత పార్టీ స్థాపించి తెలంగాణా రాష్ట్రం కోసం బలిదానాలు వద్దు కొట్లాడి తెచ్చుకుందామంటూ భరోసా యాత్ర నిర్వహించారు. తిరిగి 2011 నాగర్ కర్నూల్ ఉప ఎన్నికల్లో స్వతంత్రుడిగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత నాగం జనార్దన్ రెడ్డి బిజెపిలో చేరారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత కేసీఆర్‌పై ఒంటరి పోరాటం చేస్తూ.. గులాబీ పార్టీ ప్రభుత్వంలో అక్రమాలు జరుగుతున్నాయని కోర్టులో కేసులు వేశారు. బిజెపిలో కొనసాగుతున్నప్పుడు 2014 ఎన్నికల్లో మహబూబ్ నగర్ ఎంపిగా ఆయనకు, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన కుమారుడు డాక్టర్ శశిధర్ రెడ్డికి టికెట్టు ఇచ్చారు. అయితే తండ్రి కొడుకులు ఇద్దరు పరాజయం పాలయ్యారు. ఆ ఓటములు ఒకరకంగా ఆయన రాజకీయ జీవితాన్ని అదః పాతాళానికి తొక్కేశాయనే చెప్పాలి.నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో అప్పటికే నాగం,కూచకుళ్ల మధ్య పచ్చగడ్డి వేస్తే బగ్గుమనేలా రాజకీయపోరు కొనసాగుతుంది. నియోజకవర్గంలో పట్టు సాధించేందుకు ఒకరిపై ఒకరు రాజకీయ వ్యూహాలు రచించుకున్నారు. అప్పటికే బీఆర్ఎస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా టికెట్ తెచ్చుకున్న మర్రి జనార్దన్ రెడ్డి ఈ అవకాశాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్నారు. పిట్ట పోరు పిల్లి తీర్చినట్టు తీర్చినట్టు నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో ఇద్దరిని ఓడించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్యేగా గెలిచిన మర్రి జనార్ధన్ రెడ్డి నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మర్రిని ఎదుర్కొనేందుకు బద్ద శత్రువులైన నాగం, కూచకుళ్లలు కలిసికట్టుగా వ్యవహరించి మంచి ఫలితాలను సాదించారు. ఆ తర్వాత బిజెపిలో పొసగక రాజీనామా చేసిన నాగం ఎలాగైనా ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలుపొంది గౌరవ ప్రదమైన రిటైర్మెంట్ తీసుకుంటానని పలుసార్లు ప్రెస్‌మీట్లలో చెపుతూ వచ్చారు.2018 అసెంబ్లీ ఎన్నికల వేళ నాగం కాంగ్రెస్ పార్టీ లో చేరి నాగర్ కర్నూల్ అసెంబ్లీ టిక్కెట్టు తెచ్చుకున్నారు . కాని టైం కలిసి రాలేదు. నాగం జనార్దన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడంతో కూచకుళ్ల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బేషరతుగా బిఆర్ఎస్ కు మద్దతు ఇచ్చి నాగంను ఓడించారు. ఓడిన నాగం కాంగ్రెస్ పార్టీలోనే గడిచిన అసెంబ్లీ ఎన్నికల వరకూ కొనసాగుతూ వచ్చారు. నాగం జనార్దన్ రెడ్డితో విభేదించి బీఆర్ఎస్లో చేరిన కూచుకుల్ల దామోదర్ రెడ్డి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీగా కొనసాగారు. అయితే బీఆర్ఎస్‌లో తనకు సరైన గౌరవం దక్కడం లేదని 2023 ఎన్నికలకు ముందు తన తన కొడుకు రాజేష్ రెడ్డితో కలిసి బయటకు వచ్చారు.గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి తన కొడుకును ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టేందుకు కూచకుల్ల పావులు కదిపారు. అయితే అప్పటికే పార్టీలో ఉండి టికెట్ కోసం ఆశపడిన నాగం జనార్దన్ రెడ్డి కూచుకుల్లకు వ్యతిరేకంగా పావులు కదిపే ప్రయత్నం చేశారు. అయితే సర్వేల ఫలితాలు నాగం కుమారుడి కన్నా కూచకుళ్ల కుమారుడు రాజేష్ రెడ్డికి అనుకూలంగా రావడంతో కాంగ్రెస్ పార్టీ రాజేష్ రెడ్డికి టికెట్ కేటాయించి నాగం కు షాక్ ఇచ్చింది. ఇది ఇద్దరి మధ్యన గ్యాప్ ను మరింత పెంచినప్పటికీ నియోజకవర్గంలో పాతుకుపోయిన అప్పటి బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిని ఓడించాలంటే నాగం, కూచుకుల్ల ఒకటైతే సాధ్యమని కాంగ్రెస్ పెద్దలు భావించారు. అందులో భాగంగా భవిష్యత్తులో నాగం జనార్దన్ రెడ్డికి గౌరవమైన స్థానం ఇస్తామని .. బరిలో ఉన్న కూచుకుళ్ళ కు సపోర్ట్ చేయాలని అధిష్టానం ఆదేశించింది. అయితే అధిష్టానం నిర్ణయాన్ని నాగం డోంట్ కేర్ అన్నారునాగర్ కర్నూల్ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన మర్రి జనార్దన్ రెడ్డి ఆ అవకాశాన్ని మరోసారి తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేశారు. నాగం, కూచకుళ్ల మధ్య ఉన్న వైరంతో రెండవ సారి ఎమ్మెల్యేగా గెలిచిన మర్రి వారి మధ్య గ్యాప్‌ను వాడకుని మరోసారి ఎమ్మెల్యేగా గెలవాలని చూశారు. అయితే మర్రి జనార్దన్ రెడ్డి ఆశలపై నీళ్లు చల్లుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కూచకుళ్ళ రాజేష్ రెడ్డి విజయం సాధించి ఎమ్మెల్యేగా గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్టు దక్కక పోయినా నాగం పార్టీలోనే ఉండాలని కాంగ్రెస్ అధిష్టానం సూచించింది. భవిష్యత్తులో గౌరవప్రదమైన పొజిషన్ కల్పిస్తామని హామీ కూడా ఇచ్చింది. ఆ క్రమంలో కూచకుల్ల గెలుపు కోసం కృషి చేయాలని నాగం అనుచరగణం కూడా ఆయనపై వత్తిడి తెచ్చిందంట. అయితే నాగం ఎవరి మాట వినలేదు. దీర్ఘకాలంగా కేసీఆర్‌ను దూషిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమాలపై కోర్టులో కేసులు వేస్తూ వచ్చిన నాగం జనార్దన్ రెడ్డి సడన్‌గా రూట్ మార్చి కేసీఆర్, మర్రిల చెంత చేరడంతో ఆయన క్యాడర్ అయోమయానికి గురి అయింది. దాంతో నాగం అనుచరులు కూచకుళ్ల వైపు చేరిపోయారు.ఇక ఎన్నికల్లో నాగం సపోర్ట్ చేసిన మర్రి జనార్ధనరెడ్డి ఓడిపోవడంతో ఆయన పొలిటికల్ కెరీర్ క్రాస్‌రోడ్స్‌లో పడింది. రాజకీయాలలో గౌరవ ప్రదమైన రిటైర్‌మెంట్ తీసుకుందామనుకున్న నాగం కు నియోజకవర్గంలో కనీస సానుభూతి మిగల కుండా పోయింది. స్వయంకృతాపరాధంతో తన కెరీర్‌ను ఎటూ కాకుండా చేసుకున్న నాగం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, బీఆర్ఎస్‌క మద్దతుగా వాయిస్ వినిపిస్తున్నారు. డిసెంబర్ 7న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం లో 3వ స్టేజి వద్ద నిరసన దీక్ష చేపడతానని ప్రకటిచారు. అదే ఆయన అనుచరులకు నచ్చడం లేదంట. బీఆర్ఎస్ ట్రాప్ లో పడకుండా గౌరవ ప్రధమైన రిటైర్‌మెంట్ తీసుకోవాలని వారితో పాటు నియోజకవర్గ వాసులు నాగంకు సూచిస్తున్నారు.

# కౌశిక్ రెడ్డి... ఆంబోతు లెక్క తయారయ్యాడు

**- ఊర్లో పెళ్లికి కుక్కల హడావుడి అన్నట్టు ఉంది అతని వ్యవహారం**

**-ఎంఎల్సి బలుమూరి వెంకట్..**

హైదరాబాద్: కౌశిక్ రెడ్డి...ఆంబోతు లెక్క తయారయ్యాడని,అతని వ్యవహారం ఊర్లో పెళ్లికి కుక్కల హడావుడి అన్నట్టు ఉందని ఎంఎల్సి బలుమూరి వెంకట్.. విమర్శించారు.గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ నిన్ను కానిస్టేబుల్ అడ్డుకున్నా... సోషల్ మీడియా లో పెట్టుకునే వాడివి నీకు రాజకీయ భిక్ష పెట్టిన వాళ్ల ను వెన్నుపోటు పొడిచినోడివి ఉద్యోగాలు పెట్టిస్తా అని డబ్బులు వసూలు చేసుకున్నోడివి ఆఖరికి నీ పిఏల దగ్గర కూడా ఉద్యోగాలు పెట్టిస్త అని డబ్బులు వసూలు చేసినోడివి డ్రగ్స్ టెస్ట్ ఎక్కడ ఇయ్యాలో కూడా తెలియదని దుయ్యబట్టారు. నీకుకొకైన్ తీసుకునే వాడితో నీకేం సంబంధం ఏందో చెప్పుకేటీఆర్ బామ్మర్ది తప్పు చేయకపోతే.. మీ ఎంఎల్ఏ లు పోలీసులను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు.కోర్టుకు ఎందుకు వెళ్ళారు చీకటి కోణాలు బయటపడతాయి అని డ్రామాలు బిఆర్ఎస్ వాళ్ళ లెక్క మీటింగ్ పెడితే కూడా అరెస్టులు చేశారు ఇప్పుడా పరిస్థితి ఉందా.. మీరు ఎక్కడ ధర్నా చేసినా అనుమతి కూడా ఇస్తున్నామన్నారు.

# హుస్నాబాద్ లో పోక్సో కేసు నమోదు..

**- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు**

**- వివరాలు వెల్లడించిన హుస్నాబాద్ ఏసీపీ సతీష్**

హుస్నాబాద్ రూరల్: హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బాలికపై ముగ్గురు వ్యక్తులు లైంగికదాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. హుస్నాబాద్ ఏసీపీ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం రాత్రి పట్టణానికి చెందిన బోనాల శేఖర్, మల్యాల ప్రభాస్, గుర్రం భరత్ అనే ముగ్గురు వ్యక్తులు బాలికపై ముగ్గురు లైంగికదాడికి పాల్పడ్డా రు. విషయం తెలుసుకున్న బాధితురాలు తల్లి హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ లో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు పరిశోధనలో భాగంగా పాపను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి పంపించి చికిత్స అందించారు.

# జనవరి నుంచి జనగణన.. తర్వాత నియోజకవర్గాల పునర్విభజన

న్యూఢిల్లీ: జనగణనకు కేంద్ర ప్రభుత్వం రెడీ అవుతున్నట్టు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. వచ్చే ఏడాది నుంచి ఈ ప్రాసెస్ స్టార్ట్ అయ్యి.. 2026 వరకు కొనసాగవచ్చని తాజాగా ప్రభుత్వవర్గాలు పేర్కొన్నాయి. అనంతరం లోక్‌సభ స్థానాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభమవుతుందని, అది 2028కి ముగుస్తుందని వెల్లడించాయి. ప్రతి పదేళ్లకోసారి నిర్వహించాల్సిన జనగణన మూడేళ్లుగా ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది.రాష్ట్రాలవారీగా, జాతీయస్థాయిలో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు రూపొందించేందుకు ఈ జనగణనే ఇంపార్టెంట్. అయితే 2021లో కొవిడ్ కారణంగా సెన్సస్ జరగలేదు. తర్వాత కూడా ఈ ప్రక్రియ వాయిదా పడుతూ వస్తోంది.తగిన సమయంలో ఈ ప్రక్రియను నిర్వహిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కొద్దినెలల క్రితం చెప్పారు. దానిపై నిర్ణయం తీసుకున్న తర్వాత అది ఎలా జరుగుతుందో ప్రకటిస్తానని అన్నారు. ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో ఈ సర్వే ఉంటుందని వెల్లడించారు.గతేడాది ఏప్రిల్‌లో చైనాను మించిపోయి అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఇండియా ఆవిర్భవించినట్లు ఐక్యరాజ్య సమితి అనౌన్స్ చేసింది. ప్రస్తుతం చైనా జనాభా 142 కోట్ల కన్నా మన దేశ జనాభా 2 కోట్లు ఎక్కువన్నది ఒక ఎస్టిమేషనే కానీ.. ఎగ్జాక్ట్ ఫిగర్స్ లేవు. వివిధ పథకాలకు సంబంధించి 2011 నాటి గణాంకాల ఆధారంగానే లక్ష్యాలు, వ్యయ అంచనాలు రూపొందిస్తున్నారు. తొమ్మిదేళ్ల వ్యవధిలో దాదాపు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని నీతి ఆయోగ్ లెక్కలు వెల్లడించాయి.సరైన గణాంకాలు లేకుండా ఈ ప్రకటన చేయడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అలాగే జనగణన ఒక కొలిక్కి వచ్చేదాకా నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణా ఆగాల్సిందే. ఇదిలాఉంటే.. కులగణన గురించి ప్రతిపక్షాల నుంచి తీవ్ర డిమాండ్లు వస్తున్నాయి. ఈ టైంలో లేటెస్ట్ న్యూస్ వచ్చింది. అయితే దీనిపై ప్రభుత్వం అఫీషియల్‌గా చెప్పాల్సి ఉంది.

# పొరపాట్లు లేకుండా సర్వే చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి: సామాజిక మరియు ఆర్థిక సర్వే ద్వారా వివిధ వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులు ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా నమోదులు చేసేందుకు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో సామాజిక ఆర్థిక సర్వే, ధాన్యం కొనుగోళ్లు, నవంబర్ 2వ తేదీన రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్, సభ్యులు హన్మకొండలో నిర్వహించు ప్రజాభిప్రాయ సేకరణ తదితర అంశాలపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సామాజిక ఆర్థిక సర్వే ప్రక్రియపై సమగ్ర అవగాహనకలిగి ఉండాలని తెలిపారు. ప్రతి రోజు సర్వే అనంతరం వివరాలను డేటా ఎంట్రీ చేసేందుకు అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లును సిద్ధం చేయాలని తెలిపారు. ఐడిఓసి కార్యాలయంలో పర్యవేక్షకులకు మాస్టర్ ట్రైనరులతో శిక్షణా కార్యక్రమం ఉంటుందని, తదుపరి పర్యవేక్షకులు మండల స్థాయిలో సర్వే లో పాల్గొననున్న ఎన్యూమరేటర్లుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియ నిర్వహణకు ఎన్యూమరేషన్ బ్లాకులుగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 933 బ్లాకులు ఏర్పాటు చేశామని ఈ సర్వే ప్రక్రియ నవంబర్ 25 వరకు పూర్తి చేయాల్సి ఉన్నట్లు తెలిపారు. నవంబర్ 2వ తేదీన ఉదయం 10 గంటలకు హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్, సభ్యులు అన్ని వర్గాల సమగ్ర సమాచార సేకరణ ప్రక్రియపై నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణపై ప్రజలు కుల సంఘాల నాయకులు, మేధావులు, సంచార జాతులు, ప్రజా ప్రతినిధులు తదితరులు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న బిసి సంక్షేమ అధికారి కార్యాలయంలో విజ్ఞాపనలు అంద చేయాలని తెలిపారు. బీసీ కమిషన్ ద్వారా అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలు, సూచనలు సేకరించబడుతున్నాయని, కమిషన్,



సభ్యులు ప్రజల అభిప్రాయాలను సేకరించి వాటిపై వివరణాత్మక నివేదికను రూపొందించనున్నారని తెలిపారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని వారి వారి అభిప్రాయాలను తెలియజేయాలని ఆయన సూచించారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఎంపీవోలు మండల, గ్రామ స్థాయిలో సర్వే ప్రక్రియను పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. వచ్చే వారం నుండి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో కొనుగోలుకు సన్నదంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించిందని, ఈ ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షణ చేయాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. రైతుల నుండి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయడం ద్వారా వారికి ఆర్థిక భద్రత కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీవో మంగీలాల్, బీసీ సంక్షేమ అధికారి శైలజ, పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, మేనేజర్ రాములు, సహకార అధికారి వాలియా నాయక్, డిఆర్డిఓ అవినాష్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్,నిబంధనల మేరకే టపాసులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి

**- లైసెన్స్ లేకుండా విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు**

**- పిల్లలు, పెద్దలు టపాసులు కాల్చే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలి**

**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

జగిత్యాల: దీపావళి పండుగను పురస్కరించుకొని టపాసులు దుకాణాలు నిర్వహించేవారు లైసెన్స్ ఉన్నవారు మాత్రమే నిబంధన మేరకే షాపులు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. ఎలాంటి అగ్ని ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రదేశంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జనవాసాలు లేని బహిరంగ ప్రదేశాలలో మాత్రమే టపాకాయల షాపుల ఏర్పాటు చేసుకోవాలని అన్నరు. టపాసులను జనావాసాలలో ఎట్టి పరిస్థితుల్లో నిలువ చేయరాదని ఇలా నిలువ చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సూచించారు. దుకాణాల సమీపంలో ఇసుక, నీరు, ఫైర్ ఎక్స్‌ట్రిమిషన్‌లు ఉంచాలని సూచించారు. బాణసంచా విక్రయించే వ్యాపారులతో పాటు టపాకాయలు కాల్చే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీపావళి సందర్భంగా పిల్లలు, పెద్దలు టపాసులు కాల్చే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకొని పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ సూచించారు.

# ఆన్ లైన్ బెట్టింగ్ యువకుడు ఆత్మహత్య

హైదరాబాద్: ఆన్లైన్ బెట్టింగ్లకు మరో విద్యార్థి బలయ్యాడు. ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆన్లైన్లో బెట్టింగ్ పాల్పడుతూ అప్పులు పాలైన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న గణేష్ ఆన్లైన్లో బెట్టింగులు పెడుతూ స్నేహితుల వద్ద నుంచి అప్పులు తీసుకున్నాడు. తిరిగి ఇవ్వలేక ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గాంధీ హాస్పిటల్ లో మృతి చెందాడు.గణేష్ వర్ధన్‌పేట్‌కు చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఘట్‌కేసర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల కాలంలో బెట్టింగ్ యాప్‌లకు బానిసలుగా మారిన వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. వారం రోజుల క్రితం నర్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడవ అంతస్తు పైనుంచి ఓ వ్యక్తి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఓసాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ గచ్చిబౌలిలో పనిచేస్తున్న మృతుడు ఆన్లైన్ బెట్టింగులకు అలవాట య్యాడు. వివిధ యాప్‌ల నుంచి ఆన్లైన్లో బెట్టింగులు పెడుతూ డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో కోకాపేట్‌లో బాయ్స్ హాస్టల్లో ఉంటున్న మృతుడు ఏడవ అంతస్తు పైనుంచి దూకి అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు మృతుడు ఏపీకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మరోసారి ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆన్లైన్ బెట్టింగ్లకు బానిసగా మారి విద్యార్థి మృతి చెందడంతో బెట్టింగ్ యాప్స్‌కి బానిసలుగా మారుతున్న వారిని పోలీసులు హెచ్చరిస్తున్నారు. బెట్టింగులకు పాల్పడి ప్రాణాలు కోల్పోవద్దని సూచిస్తున్నారు.

# ఏపీ పార్టీలకు అనుమతులు తీసుకోవాలి...

హైదరాబాద్: జన్వాడా ఫాంహౌజ్ కేసుతో తెలుగు రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనంగా మారుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా పార్టీలు చేసుకోవడమే కాకుండా పార్టీలో విదేశీ లిక్కర్, డ్రగ్స్ వాడినట్టు కూడా పోలీసులు ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేశారు. ఇందులో ప్రముఖుల బంధువుల పేర్లను కూడా ప్రస్తావించారు. ఈ కేసులో ఓవైపు విచారణ సాగుతుంటే... మరోవైపు రాజకీయ విమర్శలు కూడా కొనసాగుతున్నాయి. ఈ కేసులో ఏం జరిగిందనే విషయాన్ని పక్కన పెడితే ఇప్పుడు పార్టీకి అనుమతి తీసుకోలేదని చెప్పడంతో చాలా మందికి కొత్త సందేహం వచ్చింది. జీహెచ్ఎంసీ పరిధిలో పార్టీలు చేసుకుంటే కచ్చితంగా అనుమతి తీసుకోవాల్సిందేనా అంటూ ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అధికారులు మాత్రం అవును అనే సమాధానం చెబుతున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో లిక్కర్‌తో పార్టీ చేసుకుంటే కచ్చితంగా అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. పార్టీ ఎక్కడైనా సరే అధికారులు అనుమతి లేకుండా లిక్కర్ పెట్టడానికి లేదు. హోటళ్లు, రెస్టారెంట్లు, నివాసాల వద్ద జరిగే ప్రైవేట్ పార్టీల్లో భారీగా మద్యం సరఫరా చేసేందుకు లైసెన్స్ తప్పనిసరి. ఇంట్లో జరిగే పార్టీలకు ఆరు బాటిళ్లలోపు మద్యం తాగేందుకు అనుమతి ఇస్తారు. అంతకు మించి వాడకోవాలనే ఆలోచన ఉంటే మాత్రం కచ్చితంగా పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా పర్మిషన్ తీసుకోవలంటే దరఖాస్తు ఖడఇ విభాగానికి ఇవ్వాలి. వీళ్లు తనిఖీలు చేసేటప్పుడు అనుమతికి మించిన మద్యం చిక్కుతే మాత్రం విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆ వెన్యూ ఓనర్‌పై కూడా కేసులు బుక్ చేస్తారు. ప్రైవేట్ ఫంక్షన్లలో మద్యం సేవించాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి. స్పోర్ట్స్, కమర్షియల్, ఎంటర్‌టైన్‌మెంట్ కేటగిరీకి సంబంధించినది ఈవెంట్స్ అయితే వాటి అనుమతికి ప్రత్యేక రూల్స్ ఉంటాయి. టిక్కెట్‌ల సంఖ్యను బట్టి ఛార్జీలు వసూలు చేస్తారు. పార్టీలకు కూడా స్లాట్‌లు ఉంటాయి. ఒక రోజులో రెండు స్లాట్‌ల్లో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు ఒక స్లాట్ ఉంటుంది. సాయంత్రం 7 నుంచి 11 గంటల వరకు మరో స్లాట్ ఉంటుంది. ఈవెంట్ దరఖాస్తు చేయడం అనుమతి తీసుకోవడం ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. అవసరమైన సర్టిఫికేట్స్ పోర్టల్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. అప్‌లోడ్ చేసిన 48 గంటల్లో అనుమతులు ఇస్తారు. లిక్కర్ పార్టీ అంటే పీపాలు పీపాలు పోయడానికి కూడా వీలు లేదు. కేవలం రోజుకు 12000 రూపాయల లిక్కర్ మాత్రమే సప్లై చేయాలి. అంతకు మించి చేయడానికి వీలు లేదు. 100 మంది కంటే తక్కువ మందితో పార్టీ చేసుకుంటే 10000 రూపాయలు ప్రభుత్వానికి చెల్లించి అనుమతి పత్రాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. వంద మంది ఒక్కరు ఎక్కువ ఉన్నా సరే 15000 రూపాయలు చెల్లించి అనుమతి తీసుకోవాలి. చేసుకునే పార్టీకి బందోబస్తు కావాలంటే కూడా పోలీసులకు రిక్వస్ట్ పెట్టుకోవచ్చు. భారీ స్థాయిలో పార్టీ పెట్టుకుంటే కావాల్సిన అనుమతులు ఇవే ఔ౦అ: పార్టీ పెట్టుకోవడానికి ఎలాంటి అభ్యంతరం లేదని అసిస్టెంట్ హెల్త్ ఆఫీస్ సంతకం చేసి ఇచ్చిన ఎన్‌వోసీ

ఫుడ్ లైసెన్స్: పార్టీ సమీపంలో ఓ కిచెన్ ఏర్పాటు చేసి ఫుడ్ వండి పెట్టే ఫెసిలిటీ ఉంటే మాత్రం కచ్చితంగా ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలి.

స్పెషల్ ఈవెంట్ లైసెన్స్: వంద మంది వరకు జనాలుపార్టీకి వస్తే 10000 రూపాయలు, అంతకు మించి వస్తే 15000 రూపాయలు చెల్లించి ఈ స్పెషల్ లైసెన్స్ తీసుకోవాలి.

వీటితోపాటు 2బీ బార్‌లైసెన్స్ కూడా తీసుకోవాల్సి ఉంటుంది. వీటికి తోడు తెలంగాణ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ డిపార్టమెంట్ అనుమతి కూడా తీసుకోవాలి.

# ఒక్కటైన శ్రీనివాసులు...

కరీంనగర్: శ్రీనివాస్ పేరుగల వారంతా ఏకతాటిపైకి వచ్చారు. కరీంనగర్ కు చెందిన వుట్కూరి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో మిత్రబృందంగా ఏర్పడ్డారు. శ్రీనివాస్ పేరుతో పదిమందితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఆ పేరు గల వారిని అందులో చేర్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 4800 మంది శ్రీనివాసులు అయ్యారు.మూడు వాట్సాప్ గ్రూప్ లు ఏర్పాటు చేసి మానవ సేవే మాధవ సేవగా భావిస్తు సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ శ్రీనివాసుల సేవా సమితి (టిఎస్ఎస్ఎస్) రిజిస్టర్ చేసి ఏడాది పూర్తైన సందర్భంగా కరీంనగర్ లోని టిటిడి కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.తలసేమియా బాధితల కోసం వందమంది రక్తదానం చేశారు. ఎస్పీ స్థాయిలో ఉన్న కరీంనగర్ పోలీస్ ట్రేనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రక్తదానం శిబిరాన్ని ప్రారంభించగా వందమంది శ్రీనివాసులు రక్తదానం చేశారు. రక్త ధానమే కాకుండా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు.శ్రీనివాస్ పేరు గలవారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 4800 మంది ఉన్నట్లు గుర్తించారు. ఏపీ తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో 12 వేల మంది శ్రీనివాసులు ఉన్నట్లు భావిస్తున్నారు. వారందరినీ టిఎస్ఎస్ఎస్ లోకి చేర్పించి రెండు తెలుగు రాష్ట్రాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. శ్రీనివాస్ పేరు గల వారు పేదరికంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చేయుత అందించాలని, అదేవిధంగా సాటి మనిషికి సహాయపడే కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.శ్రీనివాస్ పేరు గలవారు వివిధ రంగాల్లో ఉన్నారు. డాక్టర్లు ఇంజనీర్లు, ఉద్యోగులు, వ్యాపారులు,దినసరి కూలీలు, బిల్డర్లు, కాంట్రాక్టర్లు ఇలా శ్రీనివాస్ నామధేయం గల వారందరిని టిఎస్ఎస్ఎస్ గొడుగు కిందకు తెచ్చేందుకు వుట్కూరి శ్రీనివాసరెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు సమావేశానికి హాజరైన శ్రీనివాసులు. రాబోయే రోజుల్లో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం, పేదలను ఆదుకోవడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.మొదటి వార్షికోత్సవం సందర్భంగా 3000 మందితో సమావేశం నిర్వహించిన శ్రీనివాసులు వచ్చే ఏడాది వరకు 10000 మంది శ్రీనివాసులతో సమావేశం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్వాహకులు శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆచార్య దైవజ్ఞ శ్రీనివాస్ కాళేశ్వరం గారి ఆలోచనకు అనుగుణంగా శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో శ్రీనివాస్ నామదేయులు ఒక్క వేదిక పైకి రావడం గొప్ప విషయమన్నారు పిటిసి ప్రిన్సిపల్ శ్రీనివాస్. దీనిని ముందుకు తీసుకుపోవడానికి మన ఆరోగ్యం మన చేతులో అనే నినాదంతో చిరుధాన్యాలను ఆహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకుందామన్నారు.

# తమిళంలో విజయ్ చెమటలు పట్టిస్తున్నాడే...

చెన్నై: తమిళ అగ్ర హీరో విజయ్ తమిళనాడు రాజకీయాలలో ట్రెండ్ సెట్టర్ గా మారారు. ఆయన ఇటీవల తమిళిగ వెట్రి కళగం(టీవీఏ) పేరుతో ఒక పార్టీని ఏర్పాటు చేశారు.. దానికి సంబంధించి ఆదివారం మహానాడు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు : ఈ కార్యక్రమాన్ని నభూతో న భవిష్యత్ అనే స్థాయిలో టీవీఏ పార్టీ నేతలు నిర్వహిస్తున్నారు. మహానాడు ప్రారంభానికి ముందు టీవీఏ అధినేత విజయ్ నూట ఒక అడుగుల స్తంభానికి పార్టీ జెండా ను ఆవిష్కరించారు. మహా నాడు ప్రాంగణంలో మహనీయుల అనేకచోట్ల కటౌట్లు ఏర్పాటు చేశారు. ఇందులో తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇద్దరు మహిళ స్వాతంత్ర్య సమరయోధులకు స్థానాన్ని కల్పించారు. ఈ కార్యక్రమానికి దాదాపు రెండు లక్షల మంది దాకా టీవీ కే కార్యకర్తలు హాజరయ్యారు. ఇందులో విజయ్ అభిమానులు కూడా ఉన్నారు. దాదాపు 170 అడుగుల పొడవు, 65 అడుగుల వెడల్పుతో భారీ వేదిక నిర్మించారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాన్ని ఏర్పాటు చేశారు. కార్యకర్తలు కూర్చోవడానికి 55 వేల కుర్చీలను ఏర్పాటు చేశారు. మహానాడు ప్రాంగణంలో 60 అడుగుల ఎత్తులో కామరాజర్, బిఆర్ అంబేద్కర్, పెరియార్ కట్ అవుట్ లు ఏర్పాటు చేశారు. వీరితోపాటు తమిళనాడు రాష్ట్రానికి చెందిన వీర మహిళ స్వాతంత్ర్య సమరయోధురాళ్లు వీర తంగై వేలు నాచ్చియార్, అంజలై అమ్మాళ్ కటౌట్లు కూడా ఏర్పాటు చేశారు. వీరు మాత్రమే కాకుండా చేర, చోళ, పాండ్య రాజుల కటౌట్లు కూడా నిర్మించారు.. నూట ఒక అడుగుల ఎత్తైన దిమ్మె పై పార్టీ జెండాను విజయ ఆవిష్కరించారు. విజయ్ ఎగరవేసిన జెండా 20 అడుగుల వెడల్పు, 3 అడుగుల పొడవు ఉంది. భారీగా కార్యకర్తలు వచ్చిన నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. 700 సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు వచ్చిన నేపథ్యంలో వారి కోసం 300 మొబైల్ టాయిలెట్లు అప్పటికప్పుడు ఏర్పాటు చేశారు.విల్లుపురంలోని విక్రవాండీలో విజయ్ తన పార్టీకి సంబంధించి మహానాడు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తన మనోగతాన్ని, పార్టీ ఉద్దేశాలను విజయ్ వెల్లడించారు." ఎన్నో సంవత్సరాలుగా పార్టీ పెట్టాలి అనుకుంటున్నాను. చివరికి ఇన్నాళ్లకు నిజమైంది. ఇకపై సినిమాల్లో నటించను. పూర్తిగా తమిళ ప్రజల సేవ కోసమే అంకితం అవుతాను. సామాజిక న్యాయం, తమిళనాడు అభివృద్ధి, తమిళ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ పార్టీ పనిచేస్తుంది. గతంలో పరిపాలించిన పార్టీలు తమ కుటుంబం కోసమే పని చేశాయి. ప్రజల సమస్యలను గాలికి వదిలేసాయి. ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. అవినీతిని ప్రోత్సహిస్తున్నాయి. అక్రమాలను కొనసాగిస్తున్నాయి. ఇకపై వీటికి స్థానం లేదు. వినూత్నమైన పరిపాలనను తమిళ ప్రజలు చూస్తారని.. అది నేను వారికి అందిస్తానని" విజయ్ ప్రకటించారు.. పార్టీ మహానాడు వేదికగా విజయ్ చేసిన ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది. బిజెపి, డీఎంకే, అన్నా డీఎంకే పార్టీలను ఆయన నేరుగా విమర్శించకపోయినప్పటికీ.. పరోక్షంగా ఆరోపణలు చేశారు. విజయ్ మాట్లాడుతున్నంత సేపు మహానాడు వేదిక అభిమానుల ఈలలు, గోలలతో హోరెత్తిపోయింది. కార్యకర్తలు విజయ్ చిత్రపటాలను చేతుల్లో పట్టుకుని అటు ఇటు ఊపుతూ కనిపించారు. దీంతో విజయ్ రెట్టించిన ఉత్సాహంతో ప్రసంగించడం మొదలుపెట్టారు. అయితే ఆయన తమిళ కవులు రచించిన కావ్యాలను పలు సందర్భాల్లో ప్రస్తావించి.. కార్యకర్తల్లో, అభిమానుల్లో భాషాభిమానాన్ని రేకెత్తించే ప్రయత్నం చేశారు.

# ప్రజాస్వామ్యంపై దాడి సహించం

**– ప్రజా పోరాటాలకు ఎర్రజెండా నాయకత్వం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య**

**– భూములు.. భూ అక్రమార్కులు, భూస్వాముల కబ్జాల్లో ఉన్నాయి : జి. నాగయ్య**




మహబూబాబాద్: రాష్ట్రంలో ప్రజాస్వామ్యంపై దాడి సహించేది లేదని, హైదరాబాద్‌లో 144 సెక్షన్ విధించడంతో పాటు నిరసనలు, ధర్నాలు, రాస్తారో కోలు, ఆందోళనలు చేయొద్దని పోలీస్ కమిషనర్ ఆనంద్ పేరుతో ఇచ్చిన ఆదేశాలు అప్రజాస్వామికమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా పెరు మాండ్ల జగన్నాథం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ కమిషనర్ ఆదేశాలు హైదరాబాద్ వరకే పరిమితం అని ప్రకటించినా, గత అనుభవాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అన్ని ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా అమలు అవుతున్నాయని తెలిపారు. గతంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికుల తదితరుల ఆందోళనలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినప్పటికీ, వారు హైదరాబాద్ వెళ్లకుండా జిల్లాల్లో ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారని చెప్పారు. ధర్నా చౌక్ అనేది ఫంక్షన్ హాల్‌గా మారిందని, ఉదయం ఒక ధర్నా, మధ్యాహ్నం ఒక ధర్నా సాయంత్రం ఇంకో ధర్నా నిర్వహించుకోమని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ పాలన కూడా బీఆర్ఎస్ పాలనలా ఉందని వ్యాఖ్యానించారు. లక్షలాది మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని అన్నారు. గ్రూప్–1 విద్యార్థుల పాలిట జీవో 29 దుర్మార్గంగా మారిందని, దాన్ని వ్యతిరేకించినందుకు విద్యార్థులపై లాఠీ ఉపయోగించి అరెస్టు చేసి కేసులు పెట్టడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెటాలియన్‌లో పనిచేస్తున్న పోలీస్ కానిస్టేబుళు ... రాత్రి, పగలు పనిచేయాలని వ్యవసాయం చేయాలని, పండ్లతోటల్లో పనిచేయాలని ఇచ్చిన జీవో.. బానిసత్వాన్ని ప్రోత్సహించే విధంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో ప్రభుత్వ భూముల్లో ఎనిమిదేండ్లుగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలకు నేటికీ పట్టాలు ఇవ్వలేదని విమర్శించారు. మహబూబాబాద్‌లో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం 19సార్లు దాడి చేసి వారి ఇండ్లను ధ్వంసం చేసి కేసులు పెట్టిందన్నారు. 10మంది మహిళలను చిత్రహింసలు పెట్టి జైలుకు పంపారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మూడుసార్లు దాడి చేసి కేసులు పెట్టి జైలుకు పంపిందని చెప్పారు. ఎన్నికల ముందు ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరి స్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు చేస్తోంది ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరసన తెలిపే హక్కు లేదంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. హైడ్రాను హైదరాబాద్ వరకే అన్నారని, కానీ రాష్ట్రవ్యాప్తంగా కూల్చివేతలు కొనసాగుతున్నాయని అన్నారు. మానుకోటలో పేద గుడిసె వాసులకు నోటీసులు ఇచ్చారని, రేపోమాపో కూలుస్తామని భయభ్రాంతుల గురిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ఆందోళనకు వ్యతిరేకంగా ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని సూచించారు.

# సరిహద్దులో భారీగా నిఘా..

అదిలాబాద్: మహారాష్ట్రలో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఇదివరకే కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. దాంతో సరిహద్దు రాష్ట్రాల్లో నిఘా పెరిగింది. మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండటంతో తెలంగాణలోని సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెంచారు. మహారాష్ట్ర ఎన్నికల కారణంగా మంగళవారం యావత్ మాల్ డిస్ట్రిక్ట్ కలెక్టర్ కార్యాలయంలో బార్డర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌష్ ఆలంతో పాటు ఈ సమావేశంలో మహారాష్ట్రలోని యావత్ మాల్ జిల్లా కలెక్టర్ పంకజ్ ఆశీయ, జిల్లా ఎస్పీ కుమార్ చింతా ఇతర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు, మహారాష్ట్ర సరిహద్దుతో ఉన్న పోలింగ్ స్టేషన్ ల వివరాలు, సిబ్బంది ఏర్పాటు తదితర వివరాలపై చర్చించారు. మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా జిల్లా పోలీసుల పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం తెలియజేశారు. ఇదివరకే జిల్లాలో ఏడు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలు తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వివరాలు

1) బేల – శంకర్ గూడ,
2) జైనథ్ – అనంద్ పూర్,
3) జైనథ్ – పిప్పర్ వాడ,
4) బోథ్ – ఘన్ పూర్,
5) తలమడుగు – లక్ష్మీపూర్,
6) బీంపూర్ – కరంజి,
7) గదిగూడ – మెడీగూడ.

మహారాష్ట్ర సరిహద్దుతో ఎలాంటి డబ్బు మద్యం ఇతరాలు ఎన్నికల్లో ప్రభావితం చేసే బహుమతులను రవాణా చేయకుండా తనిఖీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి పోతారం శ్రీనివాస్, జైనథ్ ఎస్ఐ పురుషోత్తం పాల్గొన్నారు. మహారాష్ట్రలో ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. మహారాష్ట్రకు సంబంధించిన షెడ్యూల్ పరిశీలిస్తే.. అక్టోబర్ 29 వరకు అభ్యర్థులు నామినేషన్ వేయవచ్చు. నవంబర్ 20న ఎన్నికలు ఒకే దశలో నిర్వహించి, నవంబర్ 23న ఎలక్షన్ కమిషన్ ఓట్ల లెక్కింపు ప్రక్రియతో ఫలితాలు ప్రకటించనుంది

# సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్‌గా ఎస్.హరీశ్

**– రాష్ట్రంలో 13 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ**



హైదరాబాద్: సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ఎస్.హరీశ్ నియమితులయ్యారు. ఐ అండ్ పీఆర్‌కు ప్రస్తుతం ప్రత్యేక కమిషనర్‌గా ఉన్న ఎం.హనుమంతరావును యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా నియమించడంతో ఆ స్థానంలోకి రెవెన్యూశాఖ సంయుక్త కార్యదర్శిగా ఉన్న హరీశ్‌ను బదిలీ చేశారు. పురపాలకశాఖ డైరెక్టర్ అండ్ కమిషనర్‌గా టి.కె.శ్రీదేవి నియమితులయ్యారు. వీరితో కలిపి రాష్ట్రంలో 13 మంది ఐఏఎస్‌లను బదిలీ చేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి. ఐఏఎస్ అధికారులు నారాయణరెడ్డి–రంగారెడ్డి కలెక్టర్‌గా, త్రిపాఠి–నల్లగొండ కలెక్టర్ , మంద మకరందు– సీసీఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్, జెడ్.కె. హనుమంతులు–పర్యాటకశాఖ డైరెక్టర్, దేవాదాయశాఖ సంచాలకులుగా అదనపు బాధ్యతలు, శశాంక– రాష్ట్ర ప్రాధాన్య ప్రాజెక్టుల కమిషనర్ , హరీశ్ – విపత్తు నిర్వహణశాఖ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు, వినరు కృష్ణారెడ్డి–ఆర్ అండ్ ఆర్ భూసేకరణ కమిషనర్, ఆయేషా మస్రత్ – వైద్యారోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి, వాణిజ్య పన్నులశాఖ అదనపు కమిషనర్‌గా నిఖిల్ చక్రవర్తికి అదనపు బాధ్యతలు అప్పగించారు. కె. చంద్రశేఖర్‌రెడ్డి–డెయిరీ కార్పొరేషన్ ఎండీ, ఎస్.దిలీప్‌కుమార్–నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్, సోని బాలదేవి– క్రీడాశాఖ సంచాలకులు (అదనపు బాధ్యతలు), కొర్రా లక్ష్మి–రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఎండీ, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్‌గా కొర్రా లక్ష్మికి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు.

# బాణసంచా నియంత్రణ చేయాలి- పర్యావరణాన్ని కాపాడాలి

**– ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి**

హైదరాబాద్: దీపావళి పర్వదినాన వాయు, ధ్వని కాలుష్యాన్ని పెంచే మతాబులు, క్రాకర్స్ కాల్చడం ఆపేలా ప్రభుత్వం, పోలీస్ లు తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు కూడా అందుకు సహకరిం చాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య, జాతీయ సలహాదారులు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి,కన్వీనర్ ముదిగొండ త్యాగరాజు తదితరులు ఓ ప్రకటన లో విజ్ఞప్తి చేశారు. మానవ జీవన అవసరాలకోసం అనేక రకాల కాలుష్యాలు పోగుపడుతున్నాయని, వాటిని నియంత్రయించాల్సిన సమాజం ఇలా పండుగల పేరుతో కాలుష్యాన్ని పెంచే కార్యక్రమాలు చేయడం తగదని వారు పేర్కొన్నారు. కొన్ని రాష్ట్రాలు గ్రీన్ క్రాకర్స్ కు మాత్రమే పండుగల రోజు కొద్దిపాటి సమయం కేటాయించా యని, తెలుగు రాష్ట్రాలు మాత్రం ఆదిశగా ఆలోచించక పోవడం అత్యంత బాధాకర మన్నారు. కాలుష్యాలు అనేక రకాల రోగాలు సృష్టిస్తున్నా పాలకులకు చీమ కుట్టినట్టు లేకపోవడం అమానుష మన్నారు. ఈ రకమైన కాలుష్యాల నియంత్రణకు ప్రభుత్వాలు జనంలో అవగాహన పెంచే కార్యక్రమాలు నిరంతరం కొనసాగిం చాల్సి ఉన్నా ఆ ఊసు ఎత్తకపో వడం దారుణమన్నారు. దశాబ్దాలు గా కాలుష్యాల కారణంగా ప్రకృతి విపత్తులు భయ పెడుతుంటే పాలకులకు చీమ కుట్టినట్టు లేకపోవడం ఏంటని వారు సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికైనా తెలుగు పాలకులు స్వయం చొరవ తీసు కోని ఈ దీపావళి కి గ్రీన్ క్రాకర్స్ మినహా మతాబులు, బాంబు లు కాల్చకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదికూడా సోదర ఢీల్లీ, హర్యానా, పంజాబ్, తమిళనాడు తదితర రాష్ట్రాల మాదిరిగా దీపావళి నాడు 8 నుంచి 10 గంటల మధ్య మాత్రమే క్రాకర్స్ కు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వెలుగులు పంచే శుభఘడియలు అని, అందుకు దీపాల చిరుదివ్వె లు పండుగ మొత్తం కొనసాగేలా ప్రభుత్వం ప్రజలకు సూచించాలని వారు కోరారు.ప్రజలు కూడా మతాబుల కంటే దీపాలకు ప్రాముఖ్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**